www.aashwi.net / in

PRGI NO. TGMUL/26/A2874

ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

JOURNALISTS WANTED

- Aashwi Updates – Voice of the People
- Telangana & Andhra Pradesh
- District Bureau: Degree mandatory
- Mandal Reporters: Intermediate mandatory
- News writing & reporting skills required
- Interest in public issues preferred
- Honorarium: Based on experience & performance
- Join Aashwi Updates. Be the Voice of the People!

editor@aashwi.in

7207282727 | 72707292727



లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన స్పోర్ట్స్ అధికారి 4

శుక్రవారం, 06-11-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :172 Issue :172 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in



శభాష్ ఎస్డీఆర్ఎఫ్

- వరద సహాయక చర్యల్లో మీ సేవలు లేనివి
- సిబ్బందిని అభినందించిన మంత్రి పొంగులేటి
- పడవ బోల్తాపడి వరద ఉధృతిలో చిక్కుకున్న 11మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది
- అందరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన సహాయక బృందాలు

3



బేతుపల్లి చెరువులో గల్లంతైనవారు క్షేమం

- వెరీ గుడ్ కలెక్టర్ దివాకర్ అని ప్రశంసలు
- సీఎం రేవంత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కితాబు
- క్షేత్రస్థాయిలో మంత్రి తుమ్మల, పొంగులేటి పర్యటన

ఖమ్మం, నవంబర్ 5, ఆశ్వి అప్డేట్స్ :

ఉద్వేగ క్షణాలు.. ఉత్కంఠ భరిత ఘటన అనంతరం గురువారం ఉదయం సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్ద ప్రశాంత వాతావరణం నెలకొంది. ముందు రాత్రంతా అక్కడ జాగరమే అయింది. ఏకంగా రెస్క్యూ అపరేష న్ కు వెళ్లిన 11 మంది గల్లంతుతో బేతుపల్లి చెరువు వార్తలకు ఎక్కింది. వారంతా క్షేమంగా రావడంతో జిల్లా యంత్రాంగం చూపిన అప్రమత్తత, సమన్వయం, బాధ్యతాయుతమైన పనితీరును ప్రశంసలందుకుంది.

మిగతా 3వ పేజీలో..

ఇన్వెస్ట్ తెలంగాణ 2026 ఏర్పాట్లపై

సీఎం సమీక్ష

- 15నాటికి ఏర్పాట్ల పూర్తి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి
- గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష



హైదరాబాద్, నవంబర్ 5, ఆశ్వి అప్డేట్స్ : డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిని అధికారులు వివరించారు. సమ్మిట్ వేదిక, వివిధ హాల్స్, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మంత్రులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ఒక లైజనింగ్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతినిధులు విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే రిజిస్ట్రేషన్, పాస్‌ల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. సమ్మిట్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ముందుగానే ప్రతినిధులకు అందజేయాలన్నారు. సదస్సుకు వచ్చే ప్రముఖులు, అన్ని రంగాల ప్రతినిధులకు వేదికలోకి ప్రవేశించినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. సమ్మిట్‌లో ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారితోపాటు భద్రతా అధికారిని నియమించాలని సీఎం సూచించారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించాలని సూచించారు. పెట్టుబడి ఒప్పందాలు చేసుకునేందుకు, పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే కంపెనీల ప్రతినిధులకు ప్రత్యేక ఆహ్వానాలు అందించాలన్నారు. ఈనెల 15 నాటికి సమ్మిట్ ఏర్పాట్ల పూర్తి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక

మిగతా 2వ పేజీలో..

ఇందిరమ్మ లబ్ధిదారులతో

దీపావళి జరుపుకోవాలి

- 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమానికి సీఎం పిలుపు
- పేదల సొంతింటి సంతోషంలో భాగస్వామ్యం కావాలని సూచన
- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పండుగ వేడుకల్లో పాల్గొనాలని ఆదేశం
- క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువగా ఉండాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచన
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో పండుగ జరుపుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

2



7, 8, 9 తేదీల్లో సీఎం కొడంగల్ పర్యటన

- రూ.9,100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రైతు మేలా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ప్రారంభం
- రైతులు, పారిశ్రామికవేత్తలు, ఎస్‌హెచ్‌జీ మహిళలతో సమావేశాలు

2

బీసీ ఆత్మగౌరవ భవనాలకు

రూ.88.50 కోట్లు

- మంజూరు చేస్తూ జీవోలు జారీ
- ప్రతినిధులకు జీవో పత్రాలు అందజేసిన మంత్రి పొన్నం



హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

రాష్ట్రంలో 38 బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో

మిగతా 3వ పేజీలో..



నిపుణుల సూచనల మేరకే పునరుద్ధరణ


- డిసెంబర్‌లో పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేయండి
- దేవాదుల, సీతారామ ఎత్తిపోతల ద్వారా దిగువ గోదావరి జలాల సద్వినియోగం
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణపై సీఎం సమీక్ష

2

బొగ్గు గని కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- దీపావళి శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- సింగరేణి కార్మికులకు రూ.1,10,250 పీఎలఆర్ బోనస్ చెల్లింపు

2



ఎస్ఐఆర్, ఈవీఎంలపై

చర్చకు సిద్ధం

- ప్రధానికి అధికారికంగా లేఖ రాయండి
- ప్రత్యేక పార్లమెంట్ సమావేశానికి ప్రభుత్వం సిద్ధం
- చొరబాటుదారుల ఓట్ల తొలగింపును సమర్థించిన
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా



4



అయ్యప్ప సొసైటీని చెరబట్టి సీఎం సోదరులు

- టీఆర్ఎస్ చీఫ్ కవిత సంచలన ఆరోపణలు
- నెల రోజుల్లో చర్యలు తీసుకోకపోతే 'రెడ్ మార్క్' వేస్తాం

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని అయ్యప్ప సొసైటీని చెరబట్టి అక్రమాలకు పాల్పడుతున్నారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్)

మిగతా 2వ పేజీలో..

ఓటరు నమోదు ఫారం నుంచి ఎస్ఐఆర్ డిక్లరేషన్ తొలగింపు

- ఫారం-6 నుంచి ఎస్ఐఆర్ నిబంధన వేరు చేసిన ఈసీ
- అన్ని రాష్ట్రాలకూ కొత్త విధానం వర్తింపు
- సమావేశాల అజెండా, మినిట్స్ జారీ తప్పనిసరి
- విదేశీ పర్యటనలకు ముందస్తు అనుమతి నిబంధన
- ఐటీ మాడ్యూళ్ల పరిశీలనకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

4



నిర్బంధించినప్పటి నుంచే 24 గంటల గడువు

- అరెస్టు సమయం నుంచి లెక్కించాలన్న వాదనకు సుప్రీంకోర్టు నిరాకరణ
- ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించే అవకాశం
- గడువు దాటితే వెంటనే విడుదల చేయాలని స్పష్టీకరణ: సుప్రీంకోర్టు ధర్మాసనం

4

గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత

- సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ, వాట్సాప్ నంబర్లు
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత
- ఐటీడీఏ సమీక్షలో మంత్రి సీతక్క సూచన

2

ఇందిరమ్మ లబ్ధిదారులతో దీపావళి జరుపుకోవాలి

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

దీపావళి పండుగను పేద కుటుంబాల మధ్య జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కల సాకారమైన లబ్ధిదారులతో కలిసి ఈసారి దీపావళి వేడుకల్లో పాల్గొనాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో చేపట్టనున్న ఈ కార్యక్రమం ద్వారా పేదల ఇళ్లలో పండుగ వెలుగులు నింపడంతో పాటు, వారి ఆనందంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులకు ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందించిన సాయంతో సొంతింటిని నిర్మించుకున్న కుటుంబాలకు పండుగ మరింత ప్రత్యేకంగా మారేలా చూడాలని సీఎం సూచించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులు తమ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నివాసాలకు స్వయంగా వెళ్లాలని కోరారు. వారితో కొంత సమయం గడుపుతూ దీపావళి శుభాకాంక్షలు తెలియజేయాలని, పండుగ సంబరాల్లో పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలతో ప్రజాప్రతినిధులు నేరుగా మమేకం కావడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు.

అయ్యప్ప సొసైటీని చెరబట్టి సీఎం సోదరులు

మొదటిపేజీ తరువాయి



చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారంమీడియాతో మాట్లాడిన ఆమె గ్రౌండ్ వాటర్ లేని ఆ ప్రాంతంలో ఒక్క ఇటుక కూడా పేర్చవద్దని హైకోర్టు స్పష్టమైన ఆర్డర్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం దగ్గరుండి మరీ అక్రమ పర్మిషన్లు ఇప్పిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీ ఖానామెట్ ప్రాంతంలోని గురుకుల ట్రస్ట్ భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. సొసైటీలో 500 నుంచి 700 వరకు అక్రమ నిర్మాణాలు వెలిశాయని, ప్రస్తుతం కొత్తగా మరో 80 భవనాలు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి సోదరులే స్వయంగా ఇవి ఇప్పిస్తూ కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు. నగర ప్రజలు సరైన రోడ్లు, నీళ్లు లేక ఇబ్బందులు పడుతుంటే ఆ సమస్యలను పట్టించుకోకుండా..అక్రమ సంపాదనపైనే దృష్టి పెట్టారన్నారు. సొసైటీ భూముల్లో చట్టపరమైన రిజిస్ట్రేషన్లకు అవకాశం లేకపోవడంతో నోటరీల ద్వారా ప్లాట్లు విక్రయిస్తున్నారని, పది అంతస్తుల భవనాలు నిర్మించి పీజీ హాస్టల్స్, కాలేజీలు నడుపుతున్నారని ఆరోపించారు. భవనాల మధ్య కనీస స్థలం కూడా లేదని, ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని నిలదీశారు. మూసీ గర్భంలో ఆదిత్య బిల్డర్స్ నిర్మిస్తున్న ప్రాజెక్టులను ప్రస్తావిస్తూ సీఎం సోదరులకు విల్లాలు ఇస్తారనే వారికి అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ దోపిడీని ప్రకృతి కూడా క్షమించదని హెచ్చరించారు. అయ్యప్ప సొసైటీలో సమగ్ర సర్వే నిర్వహించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకోసం ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తున్నామని, లేనిపక్షంలో తామే స్వయంగా అక్రమ భవనాల వద్దకు వెళ్లి రెడ్ మార్క్ వేస్తామని హెచ్చరించారు. ఇక్కడ ప్రజలు ఎలాంటి ఇళ్లు, భూములు కొనుగోలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ శాఖ మంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రే పెద్దపెద్ద బిల్డర్లకు సహకరిస్తున్నారని ఆరోపించారు. మూసీ గర్భంలో నిర్మాణాలు చేపట్టిన ఆదిత్య బిల్డర్స్‌కు అదే మూసీలో మరో మూడు ప్రాజెక్టులు చేపట్టినా పట్టించుకోవటం లేదన్నారు. మూసీలో ఆదిత్య బిల్డర్స్ నిర్మాణాలకు వ్యతిరేకంగా తాము ధర్నా చేసిన తర్వాత మూడు ప్రాజెక్టులు కొత్తగా అదే మూసీలో నిర్మిస్తున్నారంటే ఎంతకు తెగించారో అర్థం చేసుకోవాలన్నారు. ఆదిత్య బిల్డర్స్ వాళ్లు ముఖ్యమంత్రి ఇద్దరు సోదరులకు చెరొక విల్లా ఇవ్వటంతోనే వారికి పర్మిషన్లు ఇచ్చారన్నారు. సమావేశంలో ఆర్టీఐ దరఖాస్తుల పెండింగ్, రాష్ట్రంలో విద్యుత్ కోతలు, కరువు పరిస్థితులు, కేంద్రరాష్ట్ర రాజకీయాలపై కూడా కవిత పలు విమర్శలు చేశారు.



గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత

ఏటూరునాగారం, ఆశ్వి అప్డేట్స్ :

గిరిజన విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. గిరిజన విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సంక్షేమం తదితర అంశాలపై ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి సంబంధిత అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతోపాటు వారి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులనూ అభినందించి ప్రోత్సహించాలని చెప్పారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని, మౌలిక సదుపాయాల నిర్వహణపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. సమస్యలను సకాలంలో గుర్తించి పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అనంతరం పీవో లెనిన్‌తో కలిసి విద్యార్థుల సమస్యలను తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక టోల్ ఫ్రీ, వాట్సాప్ నంబర్ల సేవలను మంత్రి ప్రారంభించి పోస్టర్లను ఆవిష్కరించారు. గురుకులాలు, గిరిజన సంక్షేమ విద్యాసంస్థలు, వసతి గృహాల్లోని విద్యార్థులు తమ సమస్యలను 18004253369 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి లేదా 9493368361 వాట్సాప్ నంబర్‌కు సందేశం పంపి తెలియజేయవచ్చని మంత్రి తెలిపారు. సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకునేందుకు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, డిప్యూటీ డైరెక్టర్లు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారులు, డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారులు, సహాయ గిరిజన అభివృద్ధి అధికారులు, ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ సంక్షేమ అధికారులు, ఐటీడీఏ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇన్వెస్ట్ తెలంగాణ-2026 ఏర్పాట్లపై సీఎం సమీక్ష

మొదటిపేజీ తరువాయి



రంగానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రతినిధులను ఆకట్టుకునేలా ప్రదర్శించాలన్నారు. విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి సంబంధించి ప్రత్యేక ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు తెలంగాణ విద్యారంగం ప్రతిబింబించేలా గ్లోబల్ సమ్మిట్‌లో చర్చలు జరగాలని సీఎం సూచించారు. మూడు రోజుల సమ్మిట్‌లో నాలుగు ప్రధాన హాళ్లలో 52 రంగాలవారీ సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు. గత ఏడాది సమ్మిట్‌తో పోలిస్తే ఈసారి మరింత విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఏర్పాట్లు, ప్రదర్శనలు

గతంలో ఒక ఎక్స్‌పో హాల్ ఉండగా ఈసారి ఆరు ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తున్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యమిస్తూ సమ్మిట్ కార్యక్రమాలను రూపొందించారు. రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, తెలంగాణ పెవిలియన్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పో, క్లైమేట్ కాంక్లేవ్‌ల ఏర్పాట్లను అధికారులు వివరించారు. రక్షా ఎక్స్‌పోలో రక్షణ, వైమానిక విన్యాసాలు కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు 575 సంస్థలను ఆహ్వానించగా, ఇప్పటివరకు 49 సంస్థలు ముందుకు వచ్చాయి. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాలకు సంబంధించి ఇండియా జాయ్ 2026 నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.స్టార్టప్‌ల కోసం ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు చేసి 136 స్టార్టప్‌ల ఆవిష్కరణలను ప్రదర్శించేలా ప్రణాళిక రూపొందించారు. తెలంగాణ ఇన్నోవేషన్ స్టార్టప్ ఛాలెంజ్‌లో భాగంగా వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు ఈనెల 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి 60 కంపెనీల ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల పెవిలియన్‌లో ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయ డ్రోన్లు, పాడి, మత్స్య, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు.తెలంగాణ చరిత్ర, సంస్కృతి, చేనేత, బతుకమ్మ, కాకతీయుల శిల్పకళతోపాటు రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలను ప్రతిబింబించేలా ప్రత్యేక తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు చేస్తున్నారు. సమ్మిట్ నిర్వహణ కోసం 25 రంగాలవారీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు. దాదాపు 3,500 ఆహ్వానాలను పంపించారు.

తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్

ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ మార్పులు, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు డిసెంబర్ 8న ప్రత్యేకంగా తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు. ఈ సదస్సులో దాదాపు 200 మంది శాస్త్రవేత్తలు, రైతులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొననున్నారు. కరువును తట్టుకునే వ్యవసాయం, పశుసంరక్షణ, తాగునీటి భద్రత, అధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షణ, అడవులు, జీవవైవిధ్య పరిరక్షణ, వ్యర్థాలను సంపదగా మార్చడం వంటి ఐదు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. వాతావరణ మార్పులపై గ్లోబల్ సమ్మిట్‌లో ప్రత్యేకంగా చర్చ జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే వాతావరణ మార్పుల కారణంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి తక్షణ చర్యలతోపాటు దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో కరువు, వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించే దిశగా ఈ సదస్సు నిర్ణయాత్మక పాత్ర పోషించాలని సీఎం ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, గ్లోబల్ సమ్మిట్ అధికారుల కమిటీల సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

7, 8, 9 తేదీల్లో సీఎం కొడంగల్ పర్యటన

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:



ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈనెల 7, 8, 9 తేదీల్లో కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మెగా రైతు మేలా ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించడంతోపాటు రూ.9,100 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. పూర్తయిన భవనాల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. 7వ తేదీ ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11 గంటలకు వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట చేరుకుంటారు. 11.10 గంటలకు అక్కడ మెగా రైతు మేలా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభిస్తారు. 12 గంటల వరకు ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శిస్తారు. ఒంటి గంట వరకు ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి సమావేశంలో పాల్గొంటారు. 2 గంటల వరకు పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు. 3 గంటలకు హకీంపేట నుంచి రోడ్డు మార్గంలో కొడంగల్ నివాసానికి బయలుదేరుతారు. రాత్రి కొడంగల్‌లో బస చేస్తారు. 8వ తేదీ ఉదయం 9.15 గంటలకు కొడంగల్ నివాసం నుంచి బయలుదేరి హకీంపేట చేరుకుంటారు. 9.30 నుంచి 10.20 గంటల వరకు స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. 10.20కు పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. తర్వాత లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన, 10.45కు హకీంపేటలో రూ.4 కోట్లతో నాట్కో సంస్థ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలను ప్రారంభిస్తారు. 11 గంటలకు రూ.2.35 కోట్లతో నిర్మించిన హకీంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు. 11.30కు బొంరాస్‌పేటలో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను, రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.15కు కొడంగల్‌లో రూ.3.80 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. తర్వాత దుద్యాలలో రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను, 1.15కు రూ.12 కోట్లతో నిర్మించిన సమీకృత మండల కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారు. 1.40కు కోస్గి మండలం నాచారంలో రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో ఔటర్ రింగ్ రోడ్డు వద్ద కొత్వాల్‌గూడ నుంచి నాచారం వద్ద జాతీయ రహదారి 167ఎన్ వరకు నిర్మించనున్న రేడియల్ రోడ్డు2కు శంకుస్థాపన చేస్తారు. 2 గంటలకు కోస్గిలో రూ.6 కోట్లతో నిర్మించిన సైన్స్ మ్యూజియాన్ని ప్రారంభిస్తారు. 2.45కు దౌల్తాబాద్ మండలం బాలంపేటలో రూ.2.35 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, 3.30కు రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభిస్తారు. అనంతరం కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి కొడంగల్ నివాసం నుంచి హకీంపేటకు బయలుదేరుతారు. రాత్రి 7 గంటల వరకు అక్కడ నిర్వహించే భారీ రైతు బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

రూ.9,053 కోట్లతో 13 అభివృద్ధి పనులు

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మొత్తం రూ.9,053.48 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనలు, శిలాఫలకాల ఆవిష్కరణలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో కొత్తవాల్‌గూడ నుంచి నాచారం వరకు రూ.5,060 కోట్లతో రేడియల్ రోడ్డు2, ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.1,410 కోట్లతో 223 కొత్త, అసంపూర్తి బీటీ రహదారుల పనులు, రూ.2,100 కోట్లతో ఎంఎన్‌కేవీ లఐఎస్ రెండో దశ పనులు ఉన్నాయి. విద్యారంగంలో రూ.118.80 కోట్లతో 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, రూ.123 కోట్లతో కొడంగల్‌లో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి సంబంధించిన పనులు ఉన్నాయి. రూ.41.83 కోట్లతో కొడంగల్, కోస్గి, మద్దూరులో ఆధునిక బస్ స్టాండ్లు, రూ.20 కోట్లతో మద్దూరులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రూ.20 కోట్లతో సమీకృత డివిజనల్ కార్యాలయ సముదాయం, రూ.59.30 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. తిమ్మారెడ్డిపల్లిలో గురులోక మసంద్ ప్రభు మందిరం అభివృద్ధికి రూ.4.45 కోట్లు, కొడంగల్‌లో నిరంజన్ మఠం అభివృద్ధికి రూ.5.10 కోట్లు కేటాయించారు. హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.10 కోట్లతో పర్యాటక హోటల్ నిర్మాణం, రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నారు. రూ.46.08 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న 10 ప్రభుత్వ భవనాలను ఈ పర్యటనలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు.

నిపుణుల సూచనల మేరకే పునరుద్ధరణ

హైదరాబాద్, నవంబర్ 5, ఆశ్వి అప్డేట్స్:

కేంద్ర ప్రభుత్వ సంస్థలు, డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచనల ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న మూడు బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలపై మంత్రులు, నీటిపారుదల శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద కనిపించే నీటిని ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతికంగా లిఫ్ట్ చేయడం సాధ్యం కాదని నీటిపారుదల శాఖ ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మేడిగడ్డ నుంచి లిఫ్ట్ చేసిన నీళ్లు ఎల్లంపల్లికి చేరాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను మూసివేయాల్సి ఉంటుందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నిర్మాణ లోపాలున్న అన్నారం, సుందిళ్ల గేట్లను తెరిచే ఉంచాలని ఎన్‌డీఎస్ఏ హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. మేడిగడ్డ వద్ద నీళ్లున్నా వాటిని లిఫ్ట్ చేయడం లేదనే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రులకు సీఎం సూచించారు. దిగువ గోదావరి నీరు వృథాగా పోకుండా దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నీటిని లిఫ్ట్ చేసినట్లు చెప్పారు. దీంతో ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగునీరు, తాగునీటిని అందించామన్నారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే ఈ మూడేండ్లలో సగటున 18.13 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసినట్లు రేవంత్‌రెడ్డి చెప్పారు. గతంతో పోలిస్తే 89 శాతం అధికంగా గోదావరి నీటిని వాడుకున్నట్లు వివరించారు. అక్టోబర్‌ఞనాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ద్వారా 8.10 టీఎంసీలు లిఫ్ట్ చేసి 24.81 టీఎంసీల గోదావరి జలాలను సద్వినియోగం చేసుకున్నామని వివరించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవసాయ విస్తీర్ణం పెరిగిందని, వరి దిగుబడిలో దేశంలోనే రికార్డు సాధించామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

బ్యారేజీల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే కరువు పరిస్థితుల్లోనూ ఇబ్బందులు ఉండేవి కావని, ప్రాణహిత నీటిని తక్కువ ఖర్చుతో ఎల్లంపల్లికి తీసుకొచ్చే అవకాశం ఉండేదని అన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే మేడిగడ్డ కుంగిపోయిందంటూ బ్యారేజీల కుంగుబాటుకు దారితీసిన కారణాలను వివరించారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. బ్యారేజీల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. అవసరమైన అనుమతులను త్వరితగతిన పొందేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. మేడిగడ్డ దెబ్బతిన్న తర్వాత మూడు బ్యారేజీల పరిస్థితిపై ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేయించినట్లు అధికారులు వివరించారు. జాతీయ స్థాయి నిపుణులు, కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సంస్థల సహకారంతో తగు పరిశోధనలు పూర్తి చేసినట్లు తెలిపారు. పునరుద్ధరణకు సంబంధించిన ప్రాథమిక ప్రణాళికలకు కేంద్రం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వివరించారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులకు దాదాపు రూ.4,193 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. నిర్మాణ లోపాలకు సంబంధించిన మరమ్మతుల వ్యయాన్ని నిర్మాణ సంస్థలే భరించేలా, అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించేలా ప్రతిపాదించినట్లు వివరించారు. పనుల్లో జాప్యం జరగకుండా అన్ని ప్రక్రియలను సమాంతరంగా కొనసాగించాలని సీఎం సూచించారు. పునరుద్ధరణ పనులకు సంబంధించిన తుది అనుమతులను ఈ నెలాఖరులోగా పొందేందుకు ప్రయత్నించాలని కూడా ఆదేశించారు. ఈ ఏడాది చివరిలోగా పనులు ప్రారంభించాలన్నారు. బ్యారేజీల నీటి వినియోగ సామర్థ్యాన్ని పునరుద్ధరించే పనులతోపాటు రక్షణ పనులను రెండు దశలుగా విభజించుకోవాలని చెప్పారు. బ్యారేజీల భద్రతకు సంబంధించిన ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, నిర్మాణ సంస్థల మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణకు రూపొందించిన ప్రణాళికను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు వివరించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, టన్నెల్స్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరీక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు. సమావేశం వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరిలు వివరించారు.

బొగ్గు గని కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

న్యూఢిల్లీ, ఆశ్వి అప్డేట్స్:

సింగరేణి కార్మిక సోదర, సోదరీమణులకు, వారి కుటుంబ సభ్యులకు దీపావళి పండుగ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి సందర్భంగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు (పీఎలఆర్) బోనస్ గురువారం అందుతుండటం సంతోషకరమన్నారు. కోల్‌కతాలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) ప్రధాన కార్యాలయంలో జాతీయ కార్మిక సంఘాలతో కూడిన కోలిండియా సంయుక్త సంప్రదింపుల కమిటీ సమావేశంలో 202526లో సంస్థల పనితీరును పరిగణనలోకి తీసుకుని అర్హులైన కార్మికులకు రూ.1,10,250 చొప్పున బోనస్ అందించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈమేరకు సింగరేణి కార్మికులకు దీపావళి సందర్భంగా ఈ బోనస్ అందనున్నదని అన్నారు. ఇప్పటికే దసరా సందర్భంగా కార్మికులకు సంస్థ లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 అందించారు. తాజాగా పీఎల్ఆర్ బోనస్ కూడా అందుతుండటంతో పండుగ వేళ కార్మికులకు, వారి కుటుంబాలకు మరింత ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో, పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన బొగ్గును అందించడంలో సింగరేణి కార్మికుల కృషి ఎంతో విలువైనదని, ప్రతికూల పరిస్థితుల్లోనూ శ్రమిస్తున్న కార్మికులు దేశ ఇంధన భద్రతకు వెన్నెముకగా నిలుస్తున్నారని కిషన్‌రెడ్డి కొనియాడారు. వారి కష్టాన్ని, అంకితభావాన్ని అభినందించారు. సింగరేణి అభివృద్ధికి, కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత, మెరుగైన జీవన ప్రమాణాలకు కేంద్రం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. దీపావళి పండుగ కార్మికుల కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపాలని, అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఆర్థికాభివృద్ధితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

శభాష్ ఎస్డీఆర్ఎఫ్

సత్తుపల్లి, నవంబర్ 5 , ఆశ్వి అప్డేట్స్:

సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో వరద ఉధృతిలో పడవ బోల్తా పడిన ఘటనలో బుధవారం రాత్రంతా వరదలో చిక్కుకున్న 11మంది ఎస్డీఆర్ ఎఫ్ సిబ్బంది సురక్షితంగా ఒడ్డుకు చేరడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ సందర్భంగా సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు అభినందించారు.బుధవారం రాత్రి భారీ వర్షాలు, వరదలతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నవేళ ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) సిబ్బంది సేవలు మరువలేనివని రెవెన్యూ, గృహ నిర్మాణం శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. బేతుపల్లి చెరువు ఉప్పొంగిన ప్రాంతంతోపాటు దమ్మపేట మండలంలోని పలు గ్రామాలకు వరద ముప్పు ఏర్పడిన సమయంలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది తక్షణమే స్పందించి చేపట్టిన సహాయక చర్యలను అభినందించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి మంత్రి పొంగులేటి బేతుపల్లి



పెద్ద చెరువు వద్ద పరిస్థితిని గురువారం పరిశీలించారు. అనంతరం దమ్మపేట మండలంలో మల్లెపూల వాగు, ముసలిబంధం చెరువుల వద్ద గండ్లు పడిన ప్రాంతాలను సందర్శించి వరద పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. వారికి శాలువాలు కప్పి సత్కరించారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం ప్రశంసనీయమన్నారు. విధి నిర్వహణలో చూపిన తెగువకు ప్రభుత్వం తరపున అభినందనలు తెలిపారు.

గల్లంతైన 11 మంది సురక్షితం

బేతుపల్లి చెరువులో బుధవారం రాత్రి ప్రమాదం జరిగిన విషయం తెలిసినప్పటినుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరంతర పర్యవేక్షించారు. బుధవారం రాత్రి పడవ బోల్తాపడి వరద ఉధృతిలో చిక్కుకున్న 11 మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిలో పదిమందిని సహాయక బృందాలు తొలుత సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి. అనంతరం గల్లంతైన మరో సిబ్బంది ఆచూకీ లభ్యమవడంతో అతడిని కూడా సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఖమ్మం పోలీస్ కమిషనర్, రెవెన్యూ, పోలీస్, రెస్క్యూ బృందాలు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాయి. అర్ధరాత్రి దాటే వరకు సహాయక చర్యలను ఫోన్ ద్వారా నిరంతరం పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి హైదరాబాద్ నుంచి హుటాహుటిన బయలుదేరి కల్లూరు మండలం నారాయణపురం చేరుకున్నారు.

సహాయక సిబ్బందికి భట్టి విక్రమార్క అభినందనలు

హైదరాబాద్ : బేతుపల్లి చెరువులో గల్లంతైన పదిమంది ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందితోపాటు ఒక స్థానిక వ్యక్తిని సురక్షితంగా రక్షించడంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. రాత్రంతా అవిశ్రాంతంగా కొనసాగిన సహాయక చర్యల అనంతరం మొత్తం 11 మందిని క్షేమంగా బయటకు తీసుకురావడం ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆరఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సహాయక చర్యల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరి సేవలను ప్రశంసించారు. రాత్రంతా సహాయక చర్యలను భట్టి విక్రమార్క ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.గల్లంతైన వారందరినీ సురక్షితంగా కాపాడటంతో వారి కుటుంబ సభ్యులతోపాటు అందరిలోనూ ఆందోళన తొలగి ఉపశమనం కలిగిందని ఆయన అన్నారు.

బేతుపల్లి చెరువులో గల్లంతైనవారు క్షేమం

మొదటిపేజీ తరువాయి

ప్రతి క్షణం ఉత్కంఠే..

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్ద బుధవారం సాయంత్రం ఎనిమిది మంది జాలర్లు చెరువుకు వలలు కట్టేందుకు వెళ్లగా.. వరద ప్రవాహానికి అక్కడే చిక్కుకు పోయారు. స్థాని కుల సమాచారంతో భద్రాచలంలో ఉన్న10 మందితో కూడిన ఎస్ డి ఆర్ఎఫ్(స్టేట్ ఫోర్స్) బృందం రంగంలోకి దిగింది. రక్షించే చర్యల్లో భాగంగా ముందుగా బోట్లలో వెళ్లిన సిబ్బంది ముగ్గురిని క్షేమంగా ఒడ్డుకు తీసుకొ చ్చారు. మరో ఐదుగురి కోసం ఎస్ డి ఆర్ఎఫ్ సిబ్బంది రెండు బృందాలుగా విడిపోయి రెండు బోట్లలో చీకట్లోనే జాలర్లు చిక్కుకున్న ప్రాంతానికి వెళ్లారు. ఈ క్రమంలో ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగి రెండు బోట్లూ ఒకదానికొ కటి ఢీకొని నీటిలోనే బోల్తా పడ్డాయి. దీంతో పది మంది ఎస్ డి ఆర్ఎఫ్ సిబ్బంది, ఒకరు స్థానికులు మొత్తం 11 మంది వరద ప్రవా హానికి చెల్లా చెదురయ్యారు. వరద ప్రవాహంలో చిక్కి చెల్లాచె దురైన ఎస్ డి ఆర్ఎఫ్ సిబ్బందిని రక్షించేందుకు విజయవాడ నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు (సెంట్రల్ ఫోర్స్) అక్కడికి వెళ్లాయి. అర్ధరాత్రి రెండున్నర గంటల ప్రాంతంలో బెటాలియన్ కు చెందిన మంచాల వేణు ఆచూకీ లభించగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది మొదట అతన్ని ఒడ్డుకు చేర్చారు. అనంతరం గురువారం తెల్లవారు జామున 5 గంటల నుంచి 7.30 గంటల ప్రాంతంలో మిగతా వారిని గాలించి ఒడ్డుకు చేర్చడంతో వరద నీటిలో చిక్కుకున్నవారంతా సేఫ్ గా బయట పడ్డారు.

వెరీ గుడ్ కలెక్టర్.. మంత్రి తుమ్మల ప్రశంస

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని గుండెనిండుగా ప్రశంసించారు. 'వెరీగుడ్ కలెక్టర్' అంటూ అభినందించారు. పోలీసులు సహా మొత్తం 16మంది ప్రాణాలను వరద నీటి నుంచి రక్షించడంలో అధికార యంత్రాంగం సమర్థవంతతను ప్రదర్శించినట్లు తుమ్మల కీర్తించారు. ఆపద సమయంలో జిల్లా యంత్రాంగం చూపిన అప్రమత్తత, సమన్వయం, బాధ్యతాయుతమైన పనితీరును ప్రశంసించారు.అదేవిధంగా ఎస్ డి ఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని కూడా మంత్రి తుమ్మల స్థానిక సత్తుపల్లి ఫారెస్ట్ గెస్ట్ హౌజ్ లో ఘనంగా సన్మానించారు. ప్రాణాలను కాపాడడంలో ఆయా విభాగాల సిబ్బంది పోరాట ప్రతిమ అమోఘమని, వారికి జీవితాంతం రుణపడి ఉంటామని తుమ్మల పేర్కొన్నారు. 'చిమ్మ చీకట్లో ధైర్యంగా 16 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన మీకు ఈ ప్రభుత్వం తరపున, జిల్లా ప్రజల తరపున నా ధన్యవాదాలని* మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమాన్ని నిన్న రాత్రి నుంచి పర్యవేక్షించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులకు తుమ్మల తన అభినందనలు తెలిపారు. ఈ సంఘటనలో చుట్టుపక్క గ్రామాల ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించినందుకు వారికి, పార్టీ యంత్రాంగానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కూడా కితాబిచ్చారు. కలెక్టర్ ను ప్రశంసించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యల్లో పాల్గొన్న వారిని అభినందించారు.

అతిపెద్ద ఇండస్ట్రియల్ ఎక్స్‌పోగా సమ్మిట్

- **ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026ను దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఈ సమ్మిట్ నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లు, వివిధ కార్యక్రమాల పురోగతిపై సచివాలయంలో గురువారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, కంపెనీలను ఆహ్వానించామని, ఇప్పటికే అనేక సంస్థలు తమ భాగస్వామ్యానికి సంసిద్ధత వ్యక్తం చేశాయని తెలిపారు. సమ్మిట్ నిర్వహణపై తాము ఆశించిన దానికంటే అధికంగా స్పందన లభిస్తోందన్నారు. ఈ సమ్మిట్‌లో భాగంగా రక్షా ఎక్స్‌పో, స్టార్టప్ పెవిలియన్, క్రియేషన్ కార్నర్, ఫార్మాలైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, తెలంగాణ పెవిలియన్, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో, తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్, ఎడ్యుకేషన్ సమ్మిట్, ఏరోబాటిక్ఎయిర్ షో తదితర ప్రత్యేక ప్రదర్శనలు, కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. ముఖ్యంగా స్టార్టప్ పెవిలియన్, క్రియేషన్ కార్నర్ యువత, జెన్‌జీలోని సృజనాత్మకత, ఆవిష్కరణలు, నూతన ఆలోచనలకు ప్రోత్సాహం అందించే వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. సమ్మిట్‌ను సమర్థవంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణం, మౌలిక సదుపాయాలు, వ్యాపార అవకాశాలను జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు వివరించి వారిని 'రైజింగ్ తెలంగాణ విజన్'లో భాగస్వాములను చేయడమే ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని సీఎస్ పేర్కొన్నారు. ఇప్పటికే హైదరాబాద్‌తోపాటు దిల్లీలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 కర్టెన్ రైజర్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.



సమ్మిట్‌లో పాల్గొనే ప్రతినిధుల కోసం డెలిగేట్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రభుత్వ కార్యదర్శులు ఇలంబర్తి, హరిచందన, గౌరవ్ ఉప్పల్, దివ్య దేవరాజన్, శశాంక, అనుదీప్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బీసీ ఆత్మగౌరవ భవనాలకు రూ.88.50 కోట్లు

మొదటిపేజీ తరువాయి

కేటాయించిన భవన నిర్మాణాలకు సంబంధించి రూ.88.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీవోలు జారీ చేసింది. మినిస్టర్ క్వార్టర్స్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు జీవో పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో స్థలాలు కేటాయించినప్పటికీ కొన్ని పాలనా, సాంకేతిక కారణాల వల్ల నిర్మాణాలు ముందుకు సాగలేదని, హెచఎండీఏ సహకారంతో ఆ సమస్యలను పరిష్కరించామని చెప్పారు.కుల సంఘాలకు కేటాయించిన స్థలాలను నిర్మాణాలకు అనువుగా తీర్చిదిద్దేందుకు రెడీ టు కన్స్ట్రక్షన్ విధానంలో లేఅవుట్లను అభివృద్ధి చేశామన్నారు. నిధులు మంజూరు చేసినందున వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని, కార్తీక మాసంలోనే శంకుస్థాపనలు చేసుకోవాలని సూచించారు. ఏడాదిలోగా లేదా నిర్మాణ పరిస్థితులనుబట్టి నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు.

బీసీల భూములపై దుష్ప్రచారాన్ని నమ్మవద్దు

బీసీ కుల సంఘాలకు కేటాయించిన భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మంత్రి స్పష్టం చేశారు. బీసీలకు కేటాయించిన భూములు బలహీనవర్గాల ఆస్తులని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే కాక ఏ ప్రభుత్వం కూడా తిరిగి తీసుకునే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు.నిర్మాణాల్లో జాప్యం జరిగితే సంబంధిత సంఘాల ప్రతినిధులను బాధ్యులుగా చేస్తూ పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీసీ కుల సంఘాల భవనాల నిర్మాణం, నిర్వహణ కోసం ప్రభుత్వం జీవో నంబర్ 14 ద్వారా కొత్త కార్యవర్గాల ఎంపికకు మార్గదర్శకాలు తీసుకొచ్చిందని తెలిపారు. నిర్మాణాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగాలని, భవనాలను బీసీ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, వసతి సౌకర్యాలు, గ్రంథాలయాలు, సామాజిక కార్యక్రమాలు, కుల సంఘాల అభ్యున్నతికి ఉపయోగించుకోవాలని సూచించారు. ఆర్థికంగా స్థోమత ఉన్న కుల సంఘాలు ప్రభుత్వం కేటాయించిన నిధులకు అదనంగా తమవంతు సహకారం అందించాలని కోరారు. హైదరాబాద్ నగరంలో పద్మశాలి, పేరక, గౌడ, కాపు తదితర కుల సంఘాల వసతి గృహాల ద్వారా వేలాదిమంది విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగారని, అదే స్ఫూర్తితో ఇప్పుడు నిర్మించబోయే ఆత్మగౌరవ భవనాలు భవిష్యత్ తరాలకు విద్యా, సామాజిక అభివృద్ధి కేంద్రాలుగా నిలవాలని ఆకాంక్షించారు. బీసీల అభ్యున్నతి, సామాజిక న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వ విధానంలో అంతర్భాగమని, బీసీలకు సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

బీసీ భవన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేయాలి: హనుమంతరావు

అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తా పరిసరాల్లో ఉస్మానియా వర్సిటీకి సమీపంలో ఇప్పటికే ఉన్న స్థలాన్ని బీసీ అవసరాల కోసం వినియోగించుకోవాలని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు సూచించారు. ఆ స్థలంలో ఇప్పటికే పూలే విగ్రహం ఏర్పాటు చేశామని, ప్రస్తుతం ఆ స్థలం కబ్జాలకు గురవుతోందని తెలిపారు. అక్కడ గ్రంథాలయంతో పాటు రవీంద్రభారతి తరహాలో పెద్ద ఆడిటోరియం నిర్మిస్తే విద్యార్థులకు, బలహీనవర్గాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ అంశంపై ఇప్పటికే ముఖ్యమంత్రికి లేఖ రాశానని, మంత్రి పొన్నం కూడా ప్రత్యేక చొరవ తీసుకుని ఆ స్థలాన్ని బీసీ అవసరాలకు సద్వినియోగం చేసేలా చూడాలని కోరారు. బీసీ కుల సంఘాలన్నీ ఆత్మగౌరవ భవనాలను నిర్మించుకోవాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనను కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేయడం బీసీ వర్గాల అభ్యున్నతిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం వెనుకడుగు వేయకుండా మంత్రి పొన్నం ప్రత్యేక చొరవతో బీసీ కుల సంఘాలు, సంచార జాతుల ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలకు నిధుల మంజూరు జీవోలు అందించడం అభినందనీయమన్నారు. 40 బీసీ కుల సంఘాలు, 36 సంచార జాతుల కులాలకు కలిపి 76 కులాలకు భవనాల నిర్మాణానికి ని<ధుల మంజూరు జీవోలు అందించారని తెలిపారు. అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు కేటాయించినట్లుగానే బీసీలందరూ కలిసి జయంతులు, సభలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి హైదరాబాద్‌లో అయిదెకరాల స్థలం కేటాయించి సమగ్ర బీసీ భవన్ నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆత్మగౌరవ భవనాలు కేవలం భవనాలుగా కాకుండా విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక ఐక్యతకు కేంద్రాలుగా రూపుదిద్దుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న నేతలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయ దేవి, ఓబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఇతర కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ సంఘాల ముఖ్య నేతలు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మురసు తుఫాన్ బాధిత
రైతులను ఆదుకుంటాం

- **రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి**
- **ముంపు ప్రాంతాల్లో విస్తృత పర్యటన, అధికారులతో సమీక్ష**
- **2-3 రోజుల్లో నష్టం అంచనాలు పంపాలని కలెక్టర్లకు ఆదేశం**

ఖమ్మం/దమ్మపేట, ఆశ్వి అప్డేట్స్:

మురసు తుఫానులో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. తుఫాను ప్రభావంతో భారీగా వరద నీరు చేరి దెబ్బతిన్న ప్రాంతాల్లో మంత్రి గురువారం పర్యటించారు. సత్తుపల్లి, దమ్మపేట మండలాల్లో తెగిన చెరువు కట్టలు, నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి బాధిత రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్లు దివాకర టీఎస్, అంకిత్ లతో కలిసి బేతుపల్లి పెద్ద చెరువు ముంపు ప్రాంతాలను, అలాగే దమ్మపేట మండలం నాగుపల్లి వద్ద మల్లెపూల వాగు ఉప్పొంగడంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. గండుగులపల్లి వద్ద వాగు పరిసరాల్లో దెబ్బతిన్న కట్టను, దమ్మపేటలో తెగిపోయిన పేరంటాల చెరువు కట్టను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో వరద ఉద్ధృతి, సహాయక చర్యలు, చేపట్టాల్సిన మరమ్మతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం సత్తుపల్లిలోని డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ప్రాంతంలోకి వరద నీరు చేరిన ప్రాంతాన్ని సందర్శించారు.



భద్రాద్రి, ఖమ్మం అధికారులతో ప్రత్యేక సమీక్ష

వరద విపత్తుపై అధికారులు సమన్వయంతో తీసుకున్న చర్యలు, ప్రాణనష్టం లేకుండా చేపట్టిన చర్యలను మంత్రి పొంగులేటి అభినందించారు.సింగరేణి కాలరీస్ గెస్ట్ హౌజ్ లో బేతుపల్లి వరద సహాయక చర్యలు, వరద ముంపు నష్టాలపై ఖమ్మం, కొత్తగూడెం భద్రాద్రి కలెక్టర్లు, సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బోట్లు బోల్తా సంఘటనపై కలెక్టర్లు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం వలన పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. 2023 డిసెంబర్లో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత, 2024 ఆగస్టు చివరలో మున్నేరు వాగు ఊహించని రీతిలో సుమారు 7677. అడుగుల ఎత్తుతో ప్రవహించినప్పుడు భారీ నష్టం వాటిల్లిందని, అప్పట్లో ఎన్డీఆర్ఎఫ్ దగ్గర తగిన పరికరాలు లేకపోవడాన్ని గమనించిన ముఖ్యమంత్రి, మంత్రులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ విపత్తు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పోలీసు శాఖ నుంచి 1200మందిని, ఫైర్ డిపార్ట్మెంట్ నుంచి 700 మందిని ఎంపిక చేసి ఎన్డీఆర్ఎఫ్ ను పటిష్టం చేయడంతోపాటు మొత్తం 1,900 మంది సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చామన్నారు. సుమారు రూ. 60270 కోట్ల వ్యయంతో అత్యాధునిక పరికరాలను ఎస్టీ ఆర్ఎఫ్ కు ప్రభుత్వం సమకూర్చిందన్నారు. ఫలితంగా రాష్ట్రంలో ఏ మూలన విపత్తు వచ్చినా 45 నుండి 50 నిమిషాల లోపు సహాయక చర్యలు అందించేలా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గం, సత్తుపల్లి తదితర ప్రాంతాలలో విద్యుత్ శాఖ, నీటిపారుదల శాఖ, ఆర్అండ్ బి, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో జరిగిన నష్టాన్ని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించా లన్నారు. కొన్ని ప్రాంతాలలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు తెగడం, చెరువులు పొంగిపొర్లడం వల్ల కింద ఉన్న వరి ఇతర పంటలు దెబ్బతిన్నాయనారు. మల్లెపూవు వాగు ప్రవహించడం వల్ల డౌన్ స్ట్రీమ్‌లో ఉన్న పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. రోడ్లపైకి చెత్తాచెదారం, వరద నీరు చేరడం వల్ల కొన్నిచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. ఇరిగేషన్, ఆర్అండ్బి, పంచాయతీరాజ్ రోడ్లకు వాటిల్లిన నష్టాన్ని అంచనా వేయాలన్నారు. రానున్న 23 రోజుల్లోగా నష్టానికి సంబంధించిన పూర్తిస్థాయి అంచనాలు ప్రభుత్వానికి సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించామన్నారు. సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణు గోపాల్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వేగంగా వైఐపీ స్కూల్ నిర్మాణం

- **వచ్చే సంవత్సరం నుంచే అకడమిక్ బ్లాక్- I తరగతులు**
- **డీజీపీ ఆనంద్**

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) అకడమిక్ బ్లాక్1 నిర్మాణ పనులను వేగవంతం చేసి, వచ్చే విద్యా సంవత్సరం నాటికి తరగతుల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డీజీపీ స.వి. ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంచిరేవులలో పాఠశాల నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. పలు పనులకు అనుమతులు ఇస్తూ ఇతర అంశాలపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అకడమిక్, మౌలిక సదుపాయాలు, సీఎస్ఆర్, నియామకాలు, ఆర్థిక వ్యవహారాల కమిటీల పనితీరును సమీక్షించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. నాణ్యమైన తరగతి గదుల తోపాటు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని స్పష్టం చేశారు.ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు క్రమశిక్షణ, కెరీర్ మార్గదర్శకత్వం ఎంతో అవసరమని డీజీపీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల ప్రభావం లేని వాతావరణంలో విద్యాబోధన ప్రాముఖ్యత పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ స్కూల్ ప్రత్యేకతను చాటుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో కూడిన విద్య, నాణ్యమైన బోధన, సరైన మార్గదర్శకత్వం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించాలన్నారు. పోలీసు కుటుంబాల పిల్లలతోపాటు సాధారణ పౌరుల పిల్లలకూ అత్యున్నత ప్రమాణాలతో విద్య అందించే ఈ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కు భవిష్యత్తులో మంచి ఆదరణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రస్తుతం పాఠశాలలో 345 మంది విద్యార్థులు 6వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారని అధికారులు వివరించారు. వచ్చే విద్యా సంవత్సరానికి సుమారు 720 మంది విద్యార్థులకు ప్రవేశాలు, మొత్తం 1000 మంది విద్యార్థులకు విద్య వసతులు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిజిపి సూచించారు. సమావేశంలో శాంతిభద్రతల డీజీ మహేష్ భగవత్, ఆక్టోపస్ డీజీ అనిల్‌కుమార్, ఐజీపీ ఎల్.గజరావు భూపాల్, సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఏజీ అడ్మిన్ రమణ కుమార్, డీసీపీ సీహెచ్.శ్రీనివాస్, విశాల్ గోయల్, ప్రిన్సిపాల్ అనితారెడ్డి, జయకుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రం నుంచి రాష్ట్రాలకు ముందస్తు నిధులు

- 28 రాష్ట్రాలకు రూ.1.09 లక్షల కోట్ల పన్నుల వాటా విడుదల
- ఐదు రోజుల ముందుగానే నిధుల కేటాయింపు
- ఏపీకి రూ.4,597 కోట్లు.. తెలంగాణకు రూ.2,370 కోట్లు
- యూపీకి అత్యధికంగా రూ.19,208 కోట్లు

న్యూఢిల్లీ, నవంబర్ 5, ఆశ్వి అప్డేట్స్:

పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ముందస్తుగా పన్నుల వాటా నిధులను విడుదల చేసింది. సాధారణంగా నవంబర్ 10న విడుదల చేయాల్సిన నిధులను ఐదు రోజుల ముందుగానే నవంబర్ 5న అందుబాటులోకి తెచ్చింది. దేశంలోని 28 రాష్ట్రాలకు కలిపి మొత్తం రూ.1,09,019 కోట్లను కేటాయించింది. రాష్ట్రాల ఆర్థిక అవసరాలకు ఊరటనివ్వడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా మూలధన వ్యయాలను వేగవంతం చేసేందుకు రాష్ట్రాలకు వెసులుబాటు కలగనుంది. ఈ కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.4,597 కోట్లు, తెలంగాణకు రూ.2,370 కోట్లు లభించాయి. రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ.6,967 కోట్ల నిధులు అందనున్నాయి. రాష్ట్రాల వారీగా అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌కు రూ.19,208 కోట్లు, బీహార్‌కు రూ.10,845 కోట్లు కేటాయించారు. పండుగల సమయంలో నిధులను ముందుగానే విడుదల చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుకు ఆర్థికంగా తోడ్పాటు లభించనుంది.

ఎల్బీనగర్ అక్రమ అండాల సేకరణపై పోలీసుల దర్యాప్తు

- హార్మోనల్ ఇంజెక్షన్ల వినియోగంపై ఆరా
- ఎఫ్ఎస్ఎల్‌కు నమూనాలు.. నివేదిక కోసం ఎదురుచూపు
- ఏఆర్టీ, ఫెర్టిలిటీ కేంద్రాల పాత్రపై విచారణ
- ఆధారాలున్న వారినే నిందితులుగా గుర్తిస్తాం
- మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి

హైదరాబాద్, నవంబర్ 5, ఆశ్వి అప్డేట్స్:

ఎల్బీనగర్ పరిధిలో వెలుగుచూసిన అక్రమ అండాల సేకరణ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తొలుత వ్యభిచార సంబంధిత రాకెట్‌గా భావించి విచారణ చేపట్టగా, అనంతరం నిబంధనలకు విరుద్ధంగా అండాల సేకరణ జరుగుతున్నట్లు గుర్తించామని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి తెలిపారు.

మహిళలకు హార్మోనల్ ఇంజెక్షన్లు ఇచ్చి అండాలు సేకరించారా అనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న ఇంజెక్షన్లను ఎఫ్ఎస్ఎల్‌కు పంపించామని, నివేదిక వచ్చిన తర్వాత వాటిని బాధిత మహిళలకు వినియోగించారా లేదా అన్నది స్పష్టమవుతుందని చెప్పారు. ఏఆర్టీ, ఫెర్టిలిటీ కేంద్రాల మధ్య బాధ్యతలు, బాధిత మహిళలతో ఏఆర్టీ కేంద్రాల ద్వారా జరిగిన సంప్రదింపులపై ఆరా తీస్తున్నామన్నారు.

ఎగ్ డొనేషన్ పేరుతో చట్టవిరుద్ధంగా అండాలు సేకరించారా అనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సీపీ తెలిపారు. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న వారందరినీ నిందితులుగా పరిగణించబోమని, స్పష్టమైన ఆధారాలు లభించిన వారిపైనే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

జార్ఖండ్‌లో మావోయిస్టుల పేరుతో హై అలర్ట్

- నవంబర్‌లో మూడు వారాల పాటు మావోయిస్టుల కార్యక్రమాలు
- 8 నుంచి 15 వరకు ఖూనీ క్రాంతి సప్తాహ్
- 16 నుంచి 22 వరకు దమన్ విరోధీ సప్తాహ్
- 24 నుంచి 30 వరకు షహీద్ సప్తాహ్
- జిల్లాల ఎస్పీలకు ఆదేశాలు జారీ చేసిన పోలీస్ హెడ్‌క్వార్టర్స్

రాంచీ, ఆశ్వి అప్డేట్స్:

జార్ఖండ్‌లో నిషేధిత సీపీఐ (మావోయిస్టు) కార్యకలాపాలు మళ్లీ పెరుగుతున్నాయన్న నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నవంబర్‌లో మూడు వారాల పాటు మావోయిస్టులు వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం అందడంతో రాష్ట్ర వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు నిఘా పెంచాలని అన్ని జిల్లాల ఎస్పీలను పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఆదేశించింది.

పోలీస్ ఐజీ (ఆపరేషన్స్) నవంబర్ 5న జారీ చేసిన రహస్య లేఖ ప్రకారం.. నవంబర్ 8 నుంచి 15 వరకు 'ఖూనీ క్రాంతి సప్తాహ్', 16 నుంచి 22 వరకు 'దమన్ విరోధీ సప్తాహ్', 24 నుంచి 30 వరకు 'షహీద్ సప్తాహ్' నిర్వహించేందుకు మావోయిస్టులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో రాంచీ, జంషెడ్‌పూర్, ధన్‌బాద్ ఎస్ఎస్పీలతో పాటు జార్ఖండ్ జాగ్వార్ విభాగం, రైల్వే పోలీసులను కూడా అప్రమత్తం చేశారు.

జంతర్ మంతర్ హింసపై నెలలోగా నివేదిక ఇవ్వండి

- ఉన్నత స్థాయి కమిటీకి సుప్రీంకోర్టు ఆదేశం
- 149 పత్రికల్లో ప్రకటనలు ఇచ్చినా తక్కువగా వచ్చిన ఫిర్యాదులు

న్యూఢిల్లీ, ఆశ్వి అప్డేట్స్:

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత జూలైలో జరిగిన నిరసన సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, పోలీసుల ప్రవర్తనపై విచారణ జరుపుతున్న ఉన్నత స్థాయి కమిటీ నెల రోజుల్లోగా ప్రాథమిక నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు సూచించింది. ఫిర్యాదుల కోసం నిరవధికంగా వేచి ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. జూలై 20న పార్లమెంట్ మార్చ్ సందర్భంగా జరిగిన హింసపై ఫిర్యాదులు స్వీకరించేందుకు 149 పత్రికల్లో ప్రకటనలు ఇచ్చామని, అక్టోబర్ 21న మరోసారి విజ్ఞప్తి చేసినా ఆన్‌లైన్, నేరుగా వచ్చిన ఫిర్యాదులు చాలా తక్కువగా ఉన్నాయని కమిటీ కోర్టుకు తెలిపింది. తగిన సమాచారం, ఆధారాలు లేకపోవడంతో ఇప్పటివరకు నిర్ధారణకు రాలేకపోయామని వివరించింది. దీనిపై స్పందించిన ధర్మాసనం మరో నెల రోజుల గడువు ఇచ్చింది. పిటిషనర్లు సమర్పించిన అఫిడవిట్లు, వీడియో రికార్డుల్లోని ఆధారాలను పరిశీలించి నివేదిక రూపొందించాలని ఆదేశించింది. బాధితులు, సాక్షులు భయం లేకుండా ఫిర్యాదు చేసేందుకు అనామకంగా వివరాలు నమోదు చేసేలా కమిటీ ప్రత్యేక పోర్టల్ ప్రారంభించినట్లు తెలిపింది. గోప్యత అవసరమైన అంశాలు మినహా కమిటీ గుర్తించిన కీలక విషయాలను అన్ని పక్షాలతో పంచుకోవాలని సూచించింది.

ఓటరు నమోదు ఫారం నుంచి ఎస్ఐఆర్ డిక్లరేషన్ తొలగింపు

- ఫారం-6 నుంచి ఎస్ఐఆర్ నిబంధన వేరు చేసిన ఈసీ
- అన్ని రాష్ట్రాలకూ కొత్త విధానం వర్తింపు
- సమావేశాల అజెండా, మినిట్స్ జారీ తప్పనిసరి
- విదేశీ పర్యటనలకు ముందస్తు అనుమతి నిబంధన
- ఐటీ మాడ్యూళ్ల పరిశీలనకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

న్యూఢిల్లీ, నవంబర్ 5, ఆశ్వి అప్డేట్స్:

కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కీలక మార్పు చేసింది. ఆన్‌లైన్‌లో ఓటరు జాబితాలో పేరు చేర్చుకునేందుకు సమర్పించే ఫారం6 నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) డిక్లరేషన్‌ను వేరు చేసింది. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్నా.. ఈ నిబంధన దేశంలోని అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. దీంతో కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఇకపై ఫారం6తో పాటు ఎస్ఐఆర్ డిక్లరేషన్ జత చేయాల్సిన అవసరం ఉండదు. దానిని ప్రత్యేకంగా సమర్పించాల్సి ఉంటుంది.

ఎన్నికల సంఘం పనితీరులో పారదర్శకత, పరిపాలనా సౌలభ్యం పెంచే లక్ష్యంతో ఈ మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా అధికారిక సమావేశాల నిర్వహణలోనూ కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. సమావేశాలకు సంబంధించిన అజెండాను ముందుగానే సభ్యులకు అందించడంతో పాటు, సమావేశం ముగిసిన తర్వాత అధికారిక మినిట్స్ జారీ చేయాలని నిర్ణయించింది. గతంలో ఈ విధానం తప్పనిసరిగా అమలులో లేదు.

అలాగే ఎన్నికల సంఘంలో పనిచేసే అధికారులు విదేశీ పర్యటనలకు వెళ్లే ముందు ఈసీ అనుమతి పొందడాన్ని తప్పనిసరి చేసింది. కొత్త ఐటీ మాడ్యూళ్ల రూపకల్పన, ఆమోద ప్రక్రియలోనూ మార్పులు చేసింది. గతంలో ఈ అంశంపై ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తిన నేపథ్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కొత్త ఐటీ మాడ్యూళ్ల ప్రతిపాదనలను తొలుత ఈ కమిటీ పరిశీలిస్తుంది. దాని సమగ్ర సమీక్ష అనంతరం తుది ఆమోదం కోసం ఎన్నికల సంఘం ముందుకు తీసుకెళ్తారు.



ఎస్ఐఆర్, ఈవీఎంలపై చర్చకు సిద్ధం

- ప్రధానికి అధికారికంగా లేఖ రాయండి
- ప్రత్యేక పార్లమెంట్ సమావేశానికి ప్రభుత్వం సిద్ధం
- చొరబాటుదారుల ఓట్ల తొలగింపును సమర్థించిన
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా

న్యూ ఢిల్లీ, నవంబర్ 5, ఆశ్వి అప్డేట్స్:

ఎస్ఐఆర్, ఈవీఎంల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీతో బహిరంగ చర్చకు రావాలన్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సవాల్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. చర్చపై నిజంగా ఆసక్తి ఉంటే ప్రధానమంత్రికి అధికారికంగా లేఖ రాయాలని సూచించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలు, చొరబాటుదారుల అంశాలపై చర్చించేందుకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. హరియాణాలోని కర్నాల్‌లో బీజేపీ నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో, అరాజకత హఠావో' యాత్రలో అమిత్ షా మాట్లాడారు. పార్లమెంట్‌లో చర్చలకు సహకరించకుండా బయట రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరిగితే ప్రయోజనం లేదని రాహుల్‌ను విమర్శించారు. ఓటర్ల జాబితా నుంచి బోగస్ ఓట్లను తొలగిస్తుంటే కాంగ్రెస్ ఎందుకు అభ్యంతరం చెబుతోందని ప్రశ్నించారు. చొరబాటుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్లమెంట్ కార్యకలాపాలను అడ్డుకుంటూ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తోందని అమిత్ షా ఆరోపించారు. వీధుల్లో ఆందోళనలకు బదులు పార్లమెంట్‌లో చర్చించాలని హితవు పలికారు. మరోవైపు హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ మాట్లాడుతూ ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉంటుందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ఎన్నికల సంఘం నిర్వహించే సాధారణ ప్రక్రియేనని చెప్పారు. కాగా, నిరుద్యోగం, దేశ భద్రత, ఆర్థిక వ్యవస్థ వంటి అంశాలపై ప్రధాని మోదీతో ఒకే వేదికపై చర్చించేందుకు సిద్ధమని రాహుల్ గాంధీ ప్రకటించారు. దేశంలోని 73 శాతం మంది యువత ఇద్దరు నేతల మధ్య చర్చను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై అగ్రనేతల మధ్య చర్చ ప్రజాస్వామ్యానికి అవసరమని అభిప్రాయపడ్డారు.



నిర్బంధించినప్పటి నుంచే 24 గంటల గడువు

- అరెస్టు సమయం నుంచి లెక్కించాలన్న వాదనకు సుప్రీంకోర్టు నిరాకరణ
- ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించే అవకాశం
- గడువు దాటితే వెంటనే విడుదల చేయాలని స్పష్టీకరణ
- పోలీసుల నిర్బంధంపై మేజిస్ట్రేట్లు పర్యవేక్షించాలి
- సుప్రీంకోర్టు ధర్మాసనం

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:



ఒక వ్యక్తిని పోలీసులు నిర్బంధించిన సమయం నుంచే 24 గంటల గడువు ప్రారంభమవుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అధికారికంగా అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి గడువును లెక్కించాలన్న వాదనను తోసిపుచ్చింది. విచారణ, దర్యాప్తు, తనిఖీల పేరుతో నిర్బంధించిన సమయాన్ని మినహాయించడానికి వీల్లేదని జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్. చంద్రుర్కర్‌తో కూడిన ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(2) ప్రకారం నిర్బంధించిన వ్యక్తిని 24 గంటల్లోగా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలని పేర్కొంది. న్యాయస్థానానికి తీసుకెళ్లేందుకు పట్టే ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించవచ్చని స్పష్టం చేసింది. గడువు దాటితే సంబంధిత వ్యక్తిని విడుదల చేయాలని, పోలీసులు నిబంధనలు పాటించారా లేదా అన్నది మేజిస్ట్రేట్లు పరిశీలించాలని ఆదేశించింది.

త్రిపురలో ఎన్‌డీపీఎస్ కేసులో నలుగురి అరెస్టుకు సంబంధించిన పిటిషన్‌పై ఈ తీర్పు వెలువడింది. 2025 సెప్టెంబర్ 29న మధ్యాహ్నం 2 గంటలకు వారిని నిర్బంధించగా, మరుసటి రోజు ఉదయం 11 గంటలకు అధికారికంగా అరెస్టు నమోదు చేశారు. అయితే 24 గంటల గడువును నిర్బంధించిన సమయం నుంచే లెక్కించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి క్యాబినెట్ ఆమోదం
- నవంబర్ 19న సిద్దిపేటలో పథకం ప్రారంభం
- 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వేడుకలు
- ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్ల ఏర్పాటు
- క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి ఆమోదం తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న సిద్దిపేటలో నిర్వహించే బహిరంగ సభలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. అదే రోజు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తారు. నవంబర్ 20 నుంచి 30 వరకు ఇందిరమ్మ కమిటీలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు సేకరించనున్నాయి.

దీపావళి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో లబ్ధిదారులతో కలిసి వేడుకల్లో పాల్గొననున్నారు. నవంబర్ 7, 8, 9 తేదీల్లో సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలు, మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోలో పాల్గొంటారు. నవంబర్ 9న భారీ రైతు బహిరంగ సభ నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఉన్న ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రద్దు చేసి రెండు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఒక్కో కమిషన్‌లో చైర్మన్‌తో పాటు ఐదుగురు సభ్యులు ఉంటారు. తెలంగాణ ఫైర్ సర్వీస్ చట్టం 1999లో సవరణలకు ఆర్డినెన్స్ జారీ చేసేందుకు ఆమోదం తెలిపింది. భూ సర్వే, సరిహద్దుల నోటీసులపై అప్పీల్ గడువును 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గించే ప్రతిపాదనకు కూడా పచ్చజెండా ఊపింది.

రాష్ట్రంలోని వివిధ న్యాయస్థానాలకు మొత్తం 136 పోస్టులు మంజూరు చేసింది. కాటారం, ఎల్కతుర్తి కోర్టులకు 56, మరో నాలుగు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు 80 పోస్టులు కేటాయించింది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని నిర్ణయించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నారు. మరోవైపు మూడు బ్యారేజీల పునాదులు, స్పిల్‌వేల నిర్మాణంలో లోపాలున్నాయని, ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు ప్రస్తుతం వాటిలో నీటిని నిల్వ చేయకూడదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బ్యారేజీల మరమ్మతుల్లో పారదర్శకత పాటించి తిరిగి వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు



లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన స్పోర్ట్స్ అధికారి

- రూ.3 లక్షల బిల్లుల కోసం రూ.లక్ష డిమాండ్
- కాంట్రాక్టర్ ఫిర్యాదుతో ఏసీబీ వల
- అధికారి, కంప్యూటర్ ఆపరేటర్ అరెస్ట్
- మహబూబ్‌నగర్‌లో ఘటన

మహబూబ్‌నగర్, ఆశ్వి అప్డేట్స్:

మహబూబ్‌నగర్ జిల్లాలో లంచం తీసుకుంటూ యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి, కంప్యూటర్ ఆపరేటర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ కాంట్రాక్టర్‌కు సంబంధించిన రూ.3 లక్షల బిల్లుల చెల్లింపు కోసం యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి రాజేందర్ రెడ్డి లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధిత కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు. పథకం ప్రకారం గురువారం క్లాక్‌టవర్ సమీపంలోని ఓ హోటల్‌లో భోజనం చేసిన అనంతరం కాంట్రాక్టర్ నుంచి రూ.లక్ష తీసుకుంటుండగా అధికారి, కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.



ఇంట్లోనే మేకప్ వేసుకోండి.. బ్యూటీ పార్లర్ బిల్లు తగ్గించుకోండి..

అందంగా కనిపించాలంటే అలంకరణ ఎంతో అవసరం. ప్రస్తుత రోజుల్లో ప్రతి చిన్న ఫంక్షన్ కు కూడా బ్యూటీ పార్లర్ కు వెళ్లడం కామన్ అయిపోయింది. ఇక వాళ్లు కూడా గట్టిగానే ఫీజులు గుంజుతున్నారు. అయితే బ్యూటీ పార్లర్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కొన్ని సింపుల్ టిప్స్ తో ఇంట్లోనే అందంగా మేకప్ చేసుకోవచ్చు. ఆ టిప్స్ ఏంటో ఈ కథనంలో తెలుసుకుందాం..

ఫేస్ క్లీనింగ్

మేకప్ చేసుకోవడానికి ముందుగా ఫేస్ క్లీనింగ్ అనేది చాలా ముఖ్యం. ముఖంలో మెరుపు రావాలంటే మేకప్ వేసుకోవడానికి రెండు గంటల ముందు అలోవెరా జెల్ రాసుకోవాలి. ఆ తర్వాత మీరు మేకప్ వేసుకుంటే, మీ మేకప్ చాలా గ్లోగా కనిపిస్తుంది. అలోవెరా జెల్ అప్లై చేసుకున్న 10 నిమిషాల తర్వాత మీ ముఖాన్ని ఫేస్ వాష్‌తో కడుక్కోండి. ఆపై ముఖానికి మంచి మాయిశ్చరైజర్ అప్లై చేయండి. ఇది ముఖ చర్మానికి తేమను అందిస్తుంది. ఈ విధంగా మీ ముఖం మేకప్ కోసం సిద్ధంగా ఉండండి.

ప్రైమర్ :

ఏ రకమైన మేకప్ అయినా వేసుకునే ముందు, మాయిశ్చరైజేషన్,ఆ తర్వాత ప్రైమర్ అప్లై చేయడం చాలా ముఖ్యం. ఈ రెండు అప్లై చేయడం వల్ల ముఖంపై బేస్ సిద్ధంగా ఉంటుంది. ఇవి అప్లై చేయడం వల్ల వల్ల మీ మేకప్ ఎక్కువసేపు ఉంటుంది. ప్రైమర్‌ను అప్లై చేయడం వల్ల కలిగే మరో ప్రయోజనం ఏంటంటే, ముఖంపై ఉన్న మొటిమలు , మచ్చలు చాలా వరకు కనిపించకుండా ఉంటాయి.

ఫౌండేషన్ :

ప్రైమర్‌ను అప్లై చేసిన తర్వాత, ఫౌండేషన్‌ను అప్లై చేయండి. దీని కోసం, ఫౌండేషన్‌లో కొంత ఫేస్ క్రీమ్ మిక్స్ చేయండి. తద్వారా ఫౌండేషన్ బాగా మిక్స్ అవుతుంది. అప్పుడు మొత్తం ముఖంపై దీనిని అప్లై చేయండి. ఫౌండేషన్ ఎల్లప్పుడూ మీ చర్మం కంటే తేలికగా ఉండాలి. మీ ముఖంపై ఎక్కువ ఫౌండేషన్ రాసుకోకూడదని గుర్తుంచుకోండి.

బ్లషర్, హైలైటర్ :


ఫౌండేషన్ అప్లై చేసిన తర్వాత, బ్లషర్ ఉపయోగించండి. దీన్ని ఉపయోగించేటప్పుడు ఇందులో చాలా లేత రంగులు ఉపయోగించాలని గుర్తుంచుకోండి. లైట్ మేకప్ కోసం పీచ్ , పింక్ కలర్ బ్లషర్స్ వంటివి వాడితే చాలా బాగుంటుంది. మీరు ఏ రంగును ఎంచుకున్నా సరే అది మీ బుగ్గలపై ఎక్కువగా అప్లై చేయకూడదని గుర్తుంచుకోండి. ఒక వేళ మీరు హైలైటర్‌ను ఉపయోగించాలని అనుకుంటే మంచి కలర్ అప్లై చేయండి. ఇది మీ లుక్ సహజంగా కనిపించేలా చేస్తుంది.

కనుబొమ్మలు అందంగా అలంకరించుకోండి..

ఫేస్ మేకప్ తర్వాత, మీరు ఐ మేకప్ చేసినప్పుడు, అత్యంత ముఖ్యమైంది కాజల్.. ఎందుకంటే అది లేకుండా కళ్ళు నిస్తేజంగా కనిపిస్తాయి. ఇందుకోసం మీరు బ్రాండెడ్ కంపెనీ కాజల్‌ని మాత్రమే ఉపయోగించండి. ఆ తర్వాత ఐలైనర్ ను కూడా అప్లై చేయండి. దీంతో మీ మేకప్ పూర్తవుతుంది.

అందమైన పెదాల కోసం..

మేకప్‌లో లిప్‌స్టిక్‌కు అత్యంత ఆకర్షణ ఉంటుంది. మీరు మీ ఎంపిక ప్రకారం లిప్‌స్టిక్‌ను ఎంచుకోండి. ఎందుకంటే మీ స్కిన్ టోన్ ప్రకారం మీకు ఏ రంగు లిప్‌స్టిక్ సరిపోతుందో మీకు తెలుస్తుంది. నేచురల్ లుక్ కావాలంటే మరీ బ్రైట్ షేడ్ కాకుండా లైట్ కలర్ లిప్ స్టిక్ మాత్రమే ఉపయోగించండి.



పరగడపున గ్లాస్ వేడినీళ్లు తాగేయండి.. అద్భుతాలు జరుగుతాయి

ప్రస్తుతం ఆరోగ్యం ఎంతో ప్రాధాన్యఅంశంగా మారిపోయింది. జీవనశైలి, ఆహారపు అలవాట్లతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. అందుకే మనం ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని టిప్స్ కచ్చితంగా ఫాలో కావాలి. శారీరక శ్రమ చేయాలి.. కేలరీస్ కరిగించుకోవాలి. పొద్దున్నే పరగడుపున ఓ గ్లాస్ వేడినీళ్లు తాగితే అనేక ఆరోగ్య సమస్యలు దూరం అవుతాయని నిపుణులు సూచిస్తున్నారు. వేడి నీరు తాగడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు అంటున్నారు. ఉదయాన్నే వేడి నీరు తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడుతుంది.

గ్యాస్ట్రిక్ సమస్యలు దూరం

గ్యాస్ట్రిక్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి వేడి నీరు బాగా సాయపడుతుంది. తిన్న ఆహారం జీర్ణం కావడానికి వేడి నీరు ఉపయోగపడుతుంది.

మలబద్ధకం దూరం

మలబద్ధకం సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు పరిగడుపున వేడి నీరు తాగడం వల్ల నొప్పి లేకుండా సులభంగా విసర్జన అవుతుంది. దీర్ఘకాలికంగా మలబద్ధకం సమస్యలను తగ్గిస్తుంది.

వెయిట్ లాస్..

ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు తాగడం వల్ల తొందరగా బరువు తగ్గించడంలో సాయపడటంతో పాటు ఆకలిని నియంత్రిస్తుంది. బాడీలో ఉన్న వ్యర్థ పదార్థాలను పంపించడంలో వేడి నీరు ఉపయోగపడుతుంది. అలాగే రక్త ప్రసరణను పెంచుతుంది.



బ్రౌన్ రైస్ మంచిదేనా? నిజంగానే ఇన్ని లాభాలు ఉన్నాయా?

ఇటీవల స్థూలకాయం పెద్ద సమస్య. వీటితో పాటు బీపీ, షుగర్లు కామన్ అయిపోయాయి. శారీరక శ్రమ లేకపోవడం.. ఆఫీసులో, ఇంట్లో కుర్చీలకు అతుక్కుపోవడంతో అనేక రకాల ఇతర ఆరోగ్య సమస్యలు కూడా వస్తున్నాయి. అందుకే చాలా మంది ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుంటున్నారు. వైట్ రైస్ ఎక్కువగా తీసుకోవడం వల్ల సమస్యలు వస్తున్నాయని.. చాలా మంది బ్రౌన్ రైస్ తింటున్నారు. బ్రౌన్ రైస్ నిజంగానే మంచిదేనా? అసలు ఈ బ్రౌన్ రైస్ తీసుకోవడం వల్ల ఎటువంటి ప్రయోజనాలు ఉన్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం..

ఎందుకు బ్రౌన్ రైస్ బెటర్?

బ్రౌన్ రైస్ బయట ఉండే రక్షిత షెల్ వల్ల ఆరోగ్యకరమైన బియ్యంగా పరిగణిస్తారు. దీనిని పొట్టు అని పిలుస్తారు. తెల్ల బియ్యం వలె కాకుండా.. బ్రౌన్ రైస్ ఊక పొరను కలిగి ఉంటుంది. ఇది గణనీయమైన పోషకాలను కలిగి ఉంటుందని ఆహార నిపుణులు చెబుతున్నారు. బ్రౌన్ రైస్ రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక క్రమపద్ధతిలో ఉంచేందుకు తోడ్పడుతుంది. మధుమేహంతో బాధపడే వారికి ఇది అద్భుతమైన ఆహార ఎంపిక. రోజూ అరకప్పు అన్నం తినే వారికి మధుమేహం వచ్చే ప్రమాదం 60% తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. మరోవైపు పాలిష్ చేసిన బియ్యాన్ని క్రమం తప్పకుండా తీసుకునే వారికి మధుమేహం వచ్చే అవకాశాలు పంద రెట్లు పెరుగుతున్నట్లు గుర్తించారు.

ఫైబర్ అధికంగా ఉంటుంది

బ్రౌన్ రైస్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. కార్సినోమాను నివారించడంలో సహాయపడే ఆహారాల జాబితాలో ఇది అగ్రస్థానంలో ఉంది. సహజంగా బియ్యంలో ఉండే అధిక స్థాయి ఫైబర్ దీనికి కారణమని చెప్పవచ్చు. ఈ ఫైబర్స్ శరీరంలోని టాక్సిన్స్‌పై ఇంకా క్యాన్సర్‌కు కారణమయ్యే పదార్థాలతో పోటిపడతాయి. తద్వారా వాటిని తొలగించి.. పెద్దపేగు గోడకు అటాచ్ చేయకుండా ఉంచుతుంది.

యాంటీఆక్సిడెంట్లు

బ్రౌన్ రైస్‌లో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆక్సిజన్ ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టానికి వ్యతిరేకంగా తమ రక్షణను విస్తరింపజేస్తాయి. ఇందులో సూపర్ ఆక్సైడ్ డిస్ముటేస్ అనే ముఖ్యమైన యాంటీ ఆక్సిడెంట్ ఎంజైమ్ ఉంటుంది. ఇది శక్తి ఉత్పత్తి సమయంలో ఆక్సీకరణ నష్టం నుంచి కణాలను రక్షిస్తుంది.

బరువు తగ్గడానికి

అన్నంలోని ఫైబర్ కంటెంట్ పేగు పనితీరును గరిష్ట స్థాయిలో ఉంచుతుంది. ఎందుకంటే ఇది జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. డైట్‌లో క్రమబద్ధతను కోరుకునే వారికి.. రోజువారీ ఆహారంలో బ్రౌన్ రైస్ తీసుకుంటే మంచిది. అదనంగా తక్కువగా తీసుకున్నా.. కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. కార్డియోపతి, అధిక కొలెస్ట్రాల్ సంభావ్యతను తగ్గిస్తాయని పలు అధ్యయనాలు నిరూపించాయి.

ముంబయి ఇండియన్స్‌లో హార్దిక్ ఒంటరిగా ఫీలయ్యాడా? అంబటి రాయుడు కీలక వ్యాఖ్యలు

- హార్దిక్ ముంబయిలో ఒంటరిగా ఫీలయ్యాడన్న రాయుడు
- కెప్టెన్సీ వదిలి ఆటపై దృష్టి పెట్టాలని సూచన
- ముంబయిలో కొనసాగితే ఆటగాడిగానే ఉండాలన్న అభిప్రాయం
- జట్టు మారినా ఒక సీజన్ కెప్టెన్సీ వద్దని వ్యాఖ్య
- పంజాబ్, చెన్నై జట్లు అతడికి మంచి ఎంపికలని వెల్లడి

ఆశ్వి అప్డేట్స్

ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా చుట్టూ ఐపీఎల్ 2027కు ముందే చర్చ మొదలైంది. అతడు జట్టును వీడనున్నాడంటూ ట్రేడ్ వార్తలు వస్తున్న నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్, చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ఆటగాడు అంబటి రాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ముంబయి జట్టులో హార్దిక్ తనను ఒంటరిని చేశారన్న భావనకు గురై ఉండొచ్చని అభిప్రాయపడ్డాడు. అతడు మళ్లీ ముంబయి తరఫున ఆడాలనుకుంటే కెప్టెన్సీ బాధ్యతలు వదులుకుని ఆటపై దృష్టి పెట్టాలని సూచించాడు.


క్రిక్‌బజ్ చర్చలో పాల్గొన్న రాయుడు.. ముంబయిలో హార్దిక్ పరిస్థితి అంత బాలేదని వ్యాఖ్యానించాడు. జట్టులో తనను ఓ మూలకు నెట్టేసినట్టు ఓ ఆటగాడు భావిస్తే, ప్రతి విషయంలోనూ వెనక్కి చూసుకోవాల్సి వస్తుందని చెప్పాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో అలాంటి పరిస్థితులు ఆటగాడి ప్రవర్తనపై ప్రభావం చూపుతాయని అభిప్రాయపడ్డాడు. హార్దిక్ విషయంలో జరిగిన ప్రతిదానికీ అతడినే తప్పుబట్టలేమని, ఇతర కారణాలు కూడా ఉండొచ్చని పేర్కొన్నాడు.

2024 సీజన్‌కు ముందు గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబయి ఇండియన్స్‌కు తిరిగొచ్చిన హార్దిక్‌కు ఫ్రాంచైజీ కెప్టెన్సీ అప్పగించింది. అప్పటివరకు జట్టుకు నాయకత్వం వహించిన రోహిత్ శర్మను తప్పించి హార్దిక్‌కు బాధ్యతలు ఇవ్వడంపై అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మైదానంలోనూ జట్టుకు ఆశించిన ఫలితాలు దక్కలేదు. హార్దిక్ నాయకత్వంలో మూడు సీజన్లలో ముంబయి ఒక్కసారి మాత్రమే ప్లేఆఫ్స్‌కు చేరినట్లు రాయుడు ప్రస్తావించాడు.

హార్దిక్ ముంబయిలోనే కొనసాగాలనుకుంటే కెప్టెన్‌గా కాకుండా ఆటగాడిగా ఆడాలని రాయుడు సూచించాడు. తన సహజమైన ఆటను ఆస్వాదిస్తూ జట్టుకు మ్యాచ్ విన్నర్‌గా మారడంపై దృష్టి పెట్టాలని చెప్పాడు. ఒకవేళ ముంబయిని వీడితే కనీసం ఒక సీజన్ పాటు మరో జట్టులోనూ కెప్టెన్సీ చేపట్టకూడదని అభిప్రాయపడ్డాడు.

ట్రేడ్ ద్వారా హార్దిక్ వెళ్లే అవకాశాలపైనా రాయుడు స్పందించాడు. పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లలో అతడికి మంచి వాతావరణం ఉండొచ్చని పేర్కొన్నాడు. అక్కడ కెప్టెన్సీ ఒత్తిడి లేకుండా తన ఆటపై దృష్టి పెట్టవచ్చని చెప్పాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్ మాత్రం ప్రస్తుతం కెప్టెన్ అవసరంతో పాటు పలు సమస్యలు ఎదుర్కొంటున్నందున హార్దిక్‌కు అంత సులభమైన ఎంపిక కాదని విశ్లేషించాడు.

హార్దిక్ పాండ్యా ముంబయి నుంచి పంజాబ్ కింగ్స్‌కు మారే అవకాశాలపై వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అర్ష్‌దీప్ సింగ్‌తో ఆటగాళ్ల మార్పిడి ప్రతిపాదనపై చర్చలు జరుగుతున్నట్లు కొన్ని కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ ట్రేడ్‌పై ఆయా ఫ్రాంచైజీల నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.



సీఎస్‌కే, ఎస్‌ఆర్‌హెచ్ మధ్య మెగా డీల్..
సగం ధరకే లివింగ్‌స్టోన్ చెన్నై గూటికి!

- ఐపీఎల్ 2027 ట్రేడింగ్ విండోలో భారీ డీల్
- చెన్నై జట్టులోకి ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, జాక్ ఎడ్వర్డ్స్
- సన్‌రైజర్స్ హైదరాబాద్‌లోకి ఖలీల్ అహ్మద్, నాథన్ ఎల్లిస్
- రూ.13 కోట్ల లివింగ్‌స్టోన్‌ను సగం ధరకే సొంతం చేసుకున్న సీఎస్‌కే
- పేస్ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకున్న హైదరాబాద్ ఫ్రాంచైజీ



ఆశ్వి అప్డేట్స్

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ట్రేడింగ్ విండోలో ఒక భారీ ఒప్పందం కుదిరింది. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) ఫ్రాంచైజీల మధ్య పలువురు కీలక ఆటగాళ్లు చేతులు మారారు. ఈ మెగా ట్రేడ్‌లో భాగంగా, ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ చెన్నై జట్టులోకి రాగా, భారత లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఖలీల్ అహ్మద్, ఆసీస్ పేసర్ నాథన్ ఎల్లిస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ గూటికి చేరారు. ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన అంశం లివింగ్‌స్టోన్ బదిలీ. గతంలో ఎస్‌ఆర్‌హెచ్ అతడిని రూ.13 కోట్లకు కొనుగోలు చేయగా, ఇప్పుడు చెన్నై సగానికన్నా తక్కువ ధరకు, అంటే కేవలం రూ.6 కోట్లకు సొంతం చేసుకుంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో లివింగ్‌స్టోన్ కేవలం రెండు మ్యాచ్‌లే ఆడి 15 పరుగులే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. ఇక, గాయం కారణంగా గత సీజన్‌కు దూరమైన జాక్ ఎడ్వర్డ్స్‌ను సీఎస్‌కే అతని ప్రస్తుత ఫీజు రూ.3 కోట్లతో జట్టులోకి తీసుకుంది. ఈ ఇద్దరు ఓవర్సీస్ ఆల్‌రౌండర్ల చేరికతో చెన్నై జట్టు సమతూకం పెంచుకుంది.

మరోవైపు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ పేస్ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకుంది. గతంలో 2018 నుంచి 2021 వరకు ఎస్‌ఆర్‌హెచ్‌కే ప్రాతినిధ్యం వహించిన ఖలీల్ అహ్మద్, తన ప్రస్తుత ఫీజు రూ.4.8 కోట్లతో తిరిగి సొంత జట్టులోకి వచ్చాడు. ఐపీఎల్ 2025లో సీఎస్‌కే తరఫున 14 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసిన ఖలీల్, 2026లో గాయం కారణంగా ఐదు మ్యాచ్‌లకే పరిమితమయ్యాడు. డెత్ ఓవర్ల స్పెషలిస్ట్‌గా పేరున్న నాథన్ ఎల్లిస్ రూ.2 కోట్ల ఫీజుతో హైదరాబాద్ జట్టులోకి చేరాడు. అతను కూడా గత సీజన్‌లో గాయం కారణంగా ఆడలేదు.

ప్రస్తుత ట్రేడింగ్ విండోలో ఇది మూడో పెద్ద డీల్. ఇప్పటికే లక్నో నుంచి రిషభ్ పంత్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ తిరిగి తీసుకోగా, కుల్దీప్ యాదవ్‌ను వదులుకుంది. అలాగే, ఢిల్లీ నుంచి టి. నటరాజన్ తిరిగి ఎస్‌ఆర్‌హెచ్‌లోకి రాగా, బదులుగా జీషాన్ అన్సారీ ఢిల్లీకి మారిన సంగతి తెలిసిందే.

ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో రిటైర్.. 23 ఏళ్ల ప్రస్థానానికి ముగింపు

- పోర్చుగల్ జట్టుకు రొనాల్డో వీడ్కోలు
- 23 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు
- 234 మ్యాచ్‌లు.. 146 గోల్స్‌తో రికార్డు
- కోచ్ జార్జ్ జీసస్‌తో విభేదాల నడుమ ప్రకటన
- రొనాల్డో ఖాతాలో ఒక యూరో కప్, రెండు నేషన్స్ లీగ్ టైటిళ్లు
- అందని కలగా మిగిలిపోయిన సాకర్ వరల్డ్ కప్

ఆశ్వి అప్డేట్స్

ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో సంచలన నిర్ణయం తీసుకున్నాడు. పోర్చుగల్ జాతీయ జట్టు తరఫున తన అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించాడు. 23 ఏళ్ల పాటు సాగిన ప్రస్థానానికి వీడ్కోలు చెబుతూ సోషల్ మీడియాలో భావోద్వేగ వీడియోను పంచుకున్నాడు. పోర్చుగల్ తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా, అత్యధిక గోల్స్ చేసిన ఫుట్‌బాలర్‌గా రికార్డులు సృష్టించిన 41 ఏళ్ల రొనాల్డో.. ఇకపై జాతీయ జట్టు తరఫున మైదానంలో కనిపించడు. తనకు ఎంతో ప్రత్యేకమైన 7వ నంబర్ జెర్సీని తర్వాతి తరం ఆటగాడికి అందించనున్నట్లు వెల్లడించాడు.

''జాతీయ జట్టు తరఫున మైదానంలో నా ప్రయాణం నేటితో ముగుస్తోంది. నేను సాగించిన ప్రస్థానం పట్ల గర్వంగా ఉంది. పోర్చుగల్ కోసం నా శక్తినంతా ధారపోశాననే సంతృప్తితో వీడ్కోలు చెబుతున్నా'' అని రొనాల్డో తన సందేశంలో పేర్కొన్నాడు. అభిమానులు, కుటుంబ సభ్యులు, తనతో కలిసి ఆడిన సహచరులకు కృతజ్ఞతలు తెలిపాడు. 7వ నంబర్ జెర్సీ ఇక మరొకరి సొంతమైనా.. దానిని ధరించిన గర్వం తనకు ఎప్పటికీ ఉంటుందని చెప్పాడు.

కోచ్‌తో వివాదం.. చివరి రోజుల్లో కలకలం

రొనాల్డో అంతర్జాతీయ కెరీర్ ముగింపు ప్రకటనకు ముందు పోర్చుగల్ జట్టులో పరిణామాలు చర్చనీయాంశమయ్యాయి. ప్రధాన కోచ్ జార్జ్ జీసస్‌తో అతడికి విభేదాలు తలెత్తాయి. సెప్టెంబర్ 27న నార్వేతో జరిగిన నేషన్స్ లీగ్ మ్యాచ్‌లో పోర్చుగల్ 21తో గెలిచినా.. రొనాల్డోకు ఒక్క నిమిషం కూడా ఆడే అవకాశం దక్కలేదు. ఫిట్‌నెస్ నిర్వహణలో భాగంగా తనకు విశ్రాంతి ఇస్తారని తొలుత చెప్పారని, ఆ తర్వాత నార్వేతో మ్యాచ్‌లో సుమారు 30 నిమిషాలు ఆడిస్తానని కోచ్ హామీ ఇచ్చాడని రొనాల్డో వెల్లడించాడు. విరామ సమయంలో వార్మప్ చేసినా మైదానంలోకి దిగే అవకాశం రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశాడు.

మ్యాచ్ తర్వాత మీడియాకు పరిస్థితిని వివరిస్తానని కోచ్ తనతో అంగీకరించిన విషయానికి భిన్నంగా మాట్లాడాడని రొనాల్డో ఆరోపించాడు. అయితే జట్టును ఎంపిక చేసే బాధ్యత తనదేనని జీసస్ స్పష్టం చేశారు. ఈ వివాదం నేపథ్యంలో డెన్మార్క్‌తో మ్యాచ్‌కు ముందు కోపెన్‌హేగన్‌లోని జట్టు శిబిరం నుంచి రొనాల్డో వెళ్లిపోయాడు. దీనిపై పోర్చుగల్‌లో విమర్శలు వెల్లువెత్తాయి. అనంతరం తన నిర్ణయం తప్పేనని అంగీకరించిన రొనాల్డో.. సహచర ఆటగాళ్లు, అభిమానులకు క్షమాపణలు చెప్పాడు.

ఈ ఘటనపై పోర్చుగల్ ఫుట్‌బాల్ సమాఖ్య అతడికి 30 రోజుల సస్పెన్షన్‌తో పాటు 255 యూరోల జరిమానా విధించింది. అయితే ఆ శిక్షను వెనక్కి తీసుకోవడంతో తర్వాతి మ్యాచ్‌లకు అతడు అందుబాటులో ఉండే అవకాశం లభించింది. 2026 ప్రపంచకప్ తర్వాత అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకాలని గతంలో భావించిన రొనాల్డో.. సమాఖ్య అధ్యక్షుడు పెడ్రో ప్రోయెంకా సూచనతో ఆ నిర్ణయాన్ని పునరాలోచించినట్లు కథనంలో పేర్కొన్నారు.



రొనాల్డో రికార్డుల ప్రస్థానం

2003 ఆగస్టులో కజకిస్థాన్‌తో మ్యాచ్ ద్వారా పోర్చుగల్ జట్టులోకి అడుగుపెట్టిన రొనాల్డో.. ఆ మరుసటి ఏడాదే యూరో 2004 ఫైనల్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో గ్రీస్ చేతిలో పోర్చుగల్ ఓడిపోయినా.. జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. 2006 ప్రపంచకప్, 2012 యూరో కప్‌లలో పోర్చుగల్ సెమీఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు.

2016 యూరో కప్ ఫైనల్‌లో ఫ్రాన్స్‌తో తలపడిన సమయంలో గాయంతో తొలి అర్ధభాగంలోనే రొనాల్డో మైదానం వీడాడు. అయినప్పటికీ పక్కన నిలబడి సహచరులను ఉత్సాహపరిచాడు. అదనపు సమయంలో ఎడెర్ చేసిన గోల్‌తో పోర్చుగల్ తొలి యూరో కప్ టైటిల్‌ను అందుకుంది. 2019లో స్విట్జర్లాండ్‌పై సెమీఫైనల్‌లో హ్యాట్రిక్ సాధించి నేషన్స్ లీగ్ తొలి టైటిల్ గెలవడంలోనూ రొనాల్డో కీలక పాత్ర పోషించాడు. 2025లో స్పెయిన్‌తో ఫైనల్‌లోనూ గోల్ చేసి రెండోసారి నేషన్స్ లీగ్ విజేతగా నిలిచిన జట్టులో భాగమయ్యాడు.

పోర్చుగల్ తరఫున 234 మ్యాచ్‌లు ఆడి 146 గోల్స్ చేసిన రొనాల్డో.. పురుషుల అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో ఈ రెండు విభాగాల్లోనూ ప్రపంచ రికార్డులు నెలకొల్పాడు. 2026 ప్రపంచకప్‌లో ఆరు వేర్వేరు టోర్నీల్లో గోల్స్ చేసిన తొలి ఆటగాడిగా మరో ఘనత సాధించాడు. యూరో కప్ చరిత్రలో అత్యధికంగా 14 గోల్స్, 30 మ్యాచ్‌లు ఆడిన రికార్డులు కూడా అతడి పేరిటే ఉన్నాయి.

అందని ప్రపంచకప్ కల

రొనాల్డో కెరీర్‌లో ఎన్నో విజయాలు ఉన్నా.. ఫిఫా ప్రపంచకప్ మాత్రం అందని కలగానే మిగిలిపోయింది. 2006లో పోర్చుగల్ సెమీఫైనల్ చేరడమే అతడి కెరీర్‌లో ఆ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన. 2022లో మొరాకో చేతిలో క్వార్టర్ ఫైనల్లో ఓటమి, 2026లో స్పెయిన్ చేతిలో ప్రి క్వార్టర్ ఫైనల్లో పరాజయం అతడికి చేదు జ్ఞాపకాలుగా మిగిలాయి.

అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికినా.. క్లబ్ ఫుట్‌బాల్‌లో రొనాల్డో ప్రయాణం కొనసాగనుంది. అల్ నసర్ తరఫున ఆడుతున్న అతడు కెరీర్‌లో 1,000 గోల్స్ మైలురాయికి చేరువలో ఉన్నాడు. తాజా లెక్కల ప్రకారం అతడి మొత్తం గోల్స్ సంఖ్య 979. పోర్చుగల్ జట్టుకు 234 మ్యాచ్‌లు, 146 గోల్స్, ఒక యూరో కప్, రెండు నేషన్స్ లీగ్ టైటిళ్లు అందించిన రొనాల్డో వారసత్వాన్ని మరో ఆటగాడు భర్తీ చేయడం అంత సులభం కాదు.

సెంచరీలు కాదు.. 43 పరుగుల ఇన్నింగ్సే బెస్ట్.. కోహ్లీ ఎంపిక వెనుక ఆసక్తికర కారణం

- తన కెరీర్‌లో 43 పరుగుల ఇన్నింగ్సే బెస్ట్ అన్న కోహ్లీ
- 2013 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఈ ప్రదర్శన
- 34 బంతుల్లో 43 పరుగులు చేసిన విరాట్
- 66/5 కష్టాల్లో భారత్‌ను ఆదుకున్న కోహ్లీ
- జడేజాతో కలిసి 47 పరుగుల భాగస్వామ్యం

ఆశ్వి అప్డేట్స్

వన్డే క్రికెట్‌లో విరాట్ కోహ్లీ సాధించిన సెంచరీలు ఎన్నో. 183, 133 నాటౌట్ వంటి అద్భుత ఇన్నింగ్స్‌లు అభిమానుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. అయితే తన కెరీర్‌లో అత్యుత్తమ వన్డే ఇన్నింగ్స్ ఏదంటే మాత్రం కోహ్లీ అనూహ్యమైన సమాధానం చెప్పాడు. 2013 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఇంగ్లండ్‌పై చేసిన 43 పరుగుల ఇన్నింగ్సే తనకు అత్యంత ప్రత్యేకమని వెల్లడించాడు. ఈరోజు 38వ పుట్టినరోజు జరుపుకొంటున్న కోహ్లీ.. ఈ సందర్భంగా స్టార్ స్పోర్ట్స్ రూపొందించిన ప్రత్యేక వీడియోలో పాల్గొన్నాడు. తన కెరీర్‌లోని కొన్ని కీలక ఇన్నింగ్స్‌లను జతచేసి, వాటిలో ఏది అత్యుత్తమమో ఎంచుకోవాలని నిర్వాహకులు కోరారు. తొలుత 2011 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో శ్రీలంకపై చేసిన 35 పరుగుల ఇన్నింగ్స్‌ను ఎంపిక చేశాడు. హోబర్ట్‌లో శ్రీలంకపై 2012లో చేసిన అజేయ 133 పరుగులు, 2023 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై చేసిన 85 పరుగుల కంటే దానికే ప్రాధాన్యమిచ్చాడు. ఇంగ్లండ్‌పై 2017లో చేసిన 122, దక్షిణాఫ్రికాపై 2018లో సాధించిన అజేయ 160 పరుగుల ఇన్నింగ్స్‌లనూ పక్కనపెట్టాడు. అయితే చివరకు 2013 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఇంగ్లండ్‌పై చేసిన 43 పరుగుల ఇన్నింగ్స్ ముందు వాటన్నింటినీ వెనక్కి నెట్టాడు. వర్షం కారణంగా 20 ఓవర్లకు కుదించిన ఆ మ్యాచ్‌లో భారత్ 66 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ సమయంలో కోహ్లీ 34 బంతుల్లో 43 పరుగులు చేశాడు. రవీంద్ర జడేజాతో కలిసి ఆరో వికెట్‌కు 47 పరుగులు జోడించాడు. జడేజా 33 పరుగులతో రాణించడంతో భారత్ 129 పరుగులు చేసింది. అనంతరం ఇంగ్లండ్‌ను 124 పరుగులకే పరిమితం చేసి ఐదు పరుగుల తేడాతో విజయం సాధించింది. పాకిస్థాన్‌పై 2012 ఆసియా కప్‌లో చేసిన 183, దక్షిణాఫ్రికాపై 2015లో సాధించిన 138, 2015 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై చేసిన 107 పరుగుల ఇన్నింగ్స్‌లను కూడా కాదని కోహ్లీ ఎంచుకున్న ఇన్నింగ్స్ ఇది. భారీ వ్యక్తిగత స్కోర్ల కంటే జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు చేసిన కీలక పరుగులకే కోహ్లీ ఎక్కువ విలువ ఇస్తున్నాడని దీని ద్వారా స్పష్టమవుతోంది.



'యు కాంట్ సీ మీ'.. జాన్ సేనా స్టైల్‌లో కివీస్ బ్యాటర్‌ను ఆటపట్టించిన కోహ్లీ..

- కివీస్ బ్యాటర్ గ్లెన్ ఫిలిప్స్‌ను ఆటపట్టించిన విరాట్ కోహ్లీ
- రెజ్లర్ జాన్ సేనా 'యు కాంట్ సీ మీ' స్టైల్‌లో సరదా
- ఫిలిప్స్ బ్యాటింగ్‌కు వస్తుండగా సేనా పాట ప్లే కావడమే కారణం
- కోహ్లీ సరదా మూమెంట్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్

ఆశ్వి అప్డేట్స్

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మైదానంలో ఎంతో చురుగ్గా, సరదాగా ఉంటాడు. నిన్న న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో అతను కివీస్ బ్యాటర్ గ్లెన్ ఫిలిప్స్‌ను ఆటపట్టించిన తీరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రముఖ డబ్ల్యూడబ్ల్యూఈ రెజ్లర్ జాన్ సేనా ట్రేడ్‌మార్క్ జెస్చర్ అయిన 'యు కాంట్ సీ మీ' అంటూ కోహ్లీ చేసిన సైగలు అభిమానులను ఆకట్టుకున్నాయి.

ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్‌లో ఈ సంఘటన జరిగింది. మ్యాచ్ 15వ ఓవర్లో గ్లెన్ ఫిలిప్స్ బ్యాటింగ్‌కు వచ్చాడు. న్యూజిలాండ్‌లో అతను క్రీజ్‌లోకి అడుగుపెట్టినప్పుడల్లా జాన్ సేనా ఎంట్రన్స్ థీమ్ సాంగ్‌ను ప్లే చేయడం అక్కడి డీజేకు అలవాటు. ఆ పాట ప్లే అవుతుండగా, ఫిలిప్స్ మరో బ్యాటర్ డారిల్ మిచెల్‌తో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో పిచ్‌కు అవతలి వైపు నుంచి కోహ్లీ 'యు కాంట్ సీ మీ' అంటూ సైగ చేశాడు. అయితే వారు పట్టించుకోకపోవడంతో ఫిలిప్స్ గార్డ్ తీసుకునేందుకు వెళుతుండగా కోహ్లీ అతని దగ్గరకు వెళ్లి మళ్లీ అదే జెస్చర్‌ను రిపీట్ చేశాడు.



ఈ సరదా సన్నివేశానికి సంబంధించిన వీడియోలు, రీల్స్ సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అయ్యాయి. కోహ్లీ చేసిన పనికి అభిమానులు నవ్వుకుంటూ కామెంట్లు పెడుతున్నారు. ఇదిలా ఉంటే.. ఇదే మ్యాచ్‌లో విరాట్ ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. 'సేనా' (సౌతాఫ్రికా ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాలన్నింటిలోనూ 50కి పైగా వన్డే సగటు నమోదు చేసిన తొలి బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు.



ఈ సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు'తో విజయాన్ని అందుకున్నారు నటి మీనాక్షి చౌదరి. ప్రస్తుతం ఆమె చేతిలో రెండు సినిమాలున్నాయి. అందులో నాగచైతన్యతో కలిసి చేసిన 'వృషకర్మ' ఇప్పటికే పూర్తయింది. ఇది ఈ డిసెంబరు 4న తెరపైకి రానుంది. ఇక మరోవైపు కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో కార్తితో కలిసి చేస్తున్న చిత్రం చిత్రీకరణ దశలో ఉంది. అయితే ఇప్పుడు మీనాక్షి తదుపరి చిత్ర విషయమై ఓ ఆసక్తికర చర్చ మొదలైంది. ప్రస్తుతం నితిన్ హీరోగా 'సామజవరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో ఓ సినిమా పట్టాలెక్కనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడీ ప్రాజెక్ట్ కోసం నాయికగా మీనాక్షి పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

ప్రేమలోనూ 'గ్రే' కలర్!

ఒకవైపు వైవిధ్యమైన పాత్రల్లో నటిస్తూ తనదైన హావభావాలతో ప్రేక్షకులను కట్టిపడేస్తుంటారు కథానాయిక నిత్యామేనన్. మరోవైపు నిర్మాతగానూ సినీప్రియుల్ని మెప్పించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆమె.. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ గ్రే'. అంకుర్ పజ్ని విశాల్ రంజన్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్నారు. శ్రేయా శర్మ, ఆశిష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఈ మేరకు 'మీరు ఎవరి కోసమైతే మీ ప్రాణాలను అర్పించారో, వారి నుంచే మీ ప్రాణాలకు ప్రమాదమని మీరు భయపడితే? ప్రతి వివాహానికి రెండు కోణాలు ఉంటాయి. ఇందులో మీరు ఊహించని కొన్ని కొత్త కోణాలు ఉన్నాయి. ప్రేమలో కూడా 'గ్రే' కలర్ అనేది ఒకటి ఉంటుంది" అనే వ్యాఖ్యలను పంచుకుంది. ఈ పోస్టర్‌లో ఒకవైపు ఒబెరాయ్, మరోవైపు నిత్యామేనన్ అస్పష్టంగా కనిపించిన తీరు ఆకట్టుకుంది. వివాహ బంధంలో దాగి ఉన్న సంక్లిష్టతలు, రహస్యాలు, మలుపులను అన్వేషించే ఒక ఉత్కంఠభరితమైన సస్పెన్స్ డ్రామా అని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ సినిమా డిసెంబరు 11న విడుదల కానుంది.



అప్పుడు పండు... ఇకపై మహంతి ఝాన్సీరాణి!



నాగార్జున - టబు కలయిక అనగానే 'నిన్నే పెళ్లాడతా' సినిమానే గుర్తొస్తుంది. అందులో పండు పాత్రలో టబు... ఆ పేరుతో పిలుస్తూ ఆట పట్టించే నాగార్జున... ఆ ఇద్దరి మధ్య కెమిస్ట్రీని ప్రేక్షకులు ఎప్పటికీ మరిచిపోలేరు. ఆ తర్వాత ఈ ఇద్దరూ 'ఆవిడా మా ఆవిడే' సినిమాలో కలిసి నటించారు. 28 ఏళ్ల తర్వాత మళ్లీ ఆ జంట కలిసి నటిస్తున్న సినిమా... 'కింగ్ 100'. ఇది నాగార్జునకు వందో చిత్రం కావడం విశేషం. రా.కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తోంది. టబు పుట్టినరోజుని పురస్కరించుకుని బుధవారం ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది చిత్రబృందం.

'ఈ ప్రపంచంలో రెండు రకాల మనుషులు ఉంటారు. లక్‌ని నమ్మేవాళ్లు ఒకరు, హార్డ్‌వర్క్‌ని నమ్మేవాళ్లు మరొకరు. ఐ హేట్ లక్' అంటూ మహంతి ఝాన్సీరాణి అనే పాత్రలో సందడి చేశారు టబు. "ప్రపంచం 'నిన్నే పెళ్లాడతా' సినిమాలోని పండుని ఎప్పటికీ మరిచిపోదు. ఇక నుంచి మా జ్ఞాపకాల్లో మహంతి ఝాన్సీరాణి పాత్రలో నిలిచిపోతావు" అంటూ ప్రచార చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు నాగార్జున. ఈ సినిమా క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 24న ప్రేక్షకుల ముందుకు రానుంది.

జోడీ కుదిరిందా?





అదిరిపోయే స్టెప్పులతో అలరించడమే కాదు తనదైన నటనతోనూ మంచి క్రేజ్ సంపాదించుకున్నారు అందాల తార శ్రీలీల. భాషతో సంబంధం లేకుండా అగ్రతారల సరసన నటించే అవకాశాల్ని అందిపుచ్చుకుంటున్న నాయికీమె. తమిళంతో పాటు హిందీలో పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆమె ఖాతాలోకి మరో అగ్ర హీరో సినిమా చేరింది. రజనీకాంత్ ప్రధాన పాత్రలో.. అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న 'ధర్మన్' చిత్రంలో ఆమె నటించనున్నారు. నయనతార, రామ్, సిమ్రాన్, రాశీ ఖన్నా కీలక పాత్రల్లో నటిస్తోన్న ఈ సినిమాలో తాజాగా శ్రీలీల చేరినట్టు అధికారికంగా తెలుపుతూ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకుంది చిత్రబృందం. "ఆమెలో ఆ మెరుపు ఉంది, ఆమెలో ఆ పటాకా ఉంది, అందాల శ్రీలీలకు ధర్మన్‌లోకి స్వాగతం" అనే వ్యాఖ్యను జోడించింది. ఈ చిత్రాన్ని కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంస్థపై ఆర్.మహేంద్రన్‌తో కలిసి నిర్మిస్తున్నారు. అనిరుధ్ సంగీతమందిస్తున్నారు. శ్రీలీల ప్రస్తుతం అజిత్ కుమార్ ప్రధాన పాత్రలో వస్తున్న 'డేర్ డెవిల్', ధనుష్ 'ఓం' చిత్రాల్లోనూ నటిస్తున్నారు.

'ధర్మన్' పటాకా

హై వోల్టేజ్ యాక్షన్‌తో 'ఓం'

దర్శకుడిగా, హీరోగా వైవిధ్యమైన కథలతో అలరిస్తోన్న ధనుష్ ప్రధాన పాత్రలో నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'ఓం'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకుడు. ఈ చిత్రంలో మలయాళ అగ్ర కథానాయకుడు మమ్ముట్టి, సాయిపల్లవి, శ్రీలీల కీలక పాత్రల్లో నటించారు. నవంబరు 20న రానున్న ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ విడుదల చేస్తోంది. ఆసక్తికరమైన కథ, కథనాలు, హైవోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలతో సాగే ఈ చిత్రం అందర్నీ అలరిస్తుందని చిత్రబృందం తెలిపింది. ఈ సినిమాకి సాయి అభ్యంకర్ సంగీతమందించారు



G.O.A.T థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసిన హీరో దుల్కర్ సల్మాన్


జబర్దస్త్ ఫేమ్ సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం G.O.A.T (గోట్). దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సినిమాస్ సమర్పణలో ఈ చిత్రం నవంబరు 12న థియేట్రికల్ విడుదల కానుంది. ఇప్పటి వరకు ఈ చిత్రం నుంచి విడుదలైన ప్రతి కంటెంట్‌కు మంచి స్పందన వస్తుండగా.. తాజాగా ట్రైలర్‌ను ప్రముఖ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ తన సోషల్ మీడియా వేదికగా విడుదల చేసి.. చిత్ర టీమ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ.. 'సుడిగాలి సుధీర్ కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెతో నిర్మించిన చిత్రమిది. ఆయన క్రేజ్‌కు తగ్గ కథను ఎన్నుకుని ఈ సినిమా నిర్మించాను. ఆయన పాత్ర నేటి యువత కనెక్ట్ అవుతుంది. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది. సినిమా ఆద్యంతం ప్రతి ఫ్రేమ్ ఎంతో అద్భుతంగా ఉంటుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతను ఆలోచింపజేసే ఓ మంచి విషయం కూడా దాగి ఉంటుంది. తప్పకుండా ఈ చిత్రం అందర్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు.

రామాయణ.. ప్రతి సీనూ ఆస్వాదించా

అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కిన 'రామాయణ: పార్ట్ 1' భారీ అంచనాల మధ్య నేడు (నవంబరు 5) విడుదలైంది. రణ్‌బీర్ కపూర్, యశ్ , సాయిపల్లవి (Sai Pallavi) ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంపై ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ సినిమాను ఆవిష్కరించిన తీరును కొనియాడుతూ దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి (SS Rajamouli) సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టారు.

''రామాయణ' చిత్రంలోని అత్యున్నత హంగులు, వెండితెరపై ఆవిష్కరించిన అద్భుతమైన విజువల్స్ కనువిందు చేస్తున్నాయి. రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటన ఆకట్టుకుంది. ముఖ్యంగా వనవాస ఘట్టం నుంచి అతడి అభినయం ఎంతో ప్రశాంతంగా కనిపిస్తూనే, ప్రతి ఒక్కరినీ కట్టిపడేసింది. రావణుడిగా యశ్ ఆద్యంతం భయపెట్టారు. సీతగా సాయిపల్లవి హుందాగా కనిపించారు. పతాక సన్నివేశాలతో పాటు అంతకు ముందు వచ్చే ఘట్టాలైతే అత్యద్భుతం. ప్రతి సన్నివేశాన్ని ఎంతో ఆస్వాదించాను. ఇంతటి ప్రతిష్టాత్మకమైన, భారీ విజన్‌ను తెరపై ఇంత అందంగా ఆవిష్కరించినందుకు నిర్మాత నమిత్ మల్హోత్ర, దర్శకుడు నితేశ్ తివారీతో పాటు చిత్రబృందం మొత్తానికి హృదయపూర్వక అభినందనలు'' అని రాజమౌళి ప్రశంసించారు.





మొండి పిల్లలను ఇలా హ్యాండిల్ చేయండి..

చిన్న పిల్లను పెంచడం ఆషామాషీ విషయం కాదు. పిల్లల్లో కొందరు పెరిగే కొద్దీ మొండిగా తయారవుతుంటారు. వాళ్లు కోరుకున్నది కావాల్సిందే అని పట్టబట్టి కూర్చుకుంటారు. పెద్దోళ్లు ఎంత వారిస్తున్నా వినకుండా ఏడుస్తూ.. వాళ్లకి కావాల్సిందేనని డిమాండ్ చేశారు. పిల్లలు పెరిగేకొద్దీ వారు ఇంటి బయట ప్రపంచాన్ని అన్వేషించడం ప్రారంభిస్తారు. పదేళ్ల వయసు వచ్చిన తర్వాత వీరి మొండితనం మరింత పెరుగుతుంది. ఈ క్రమంలో వారు కొత్తకొత్త విషయాలు తెలుసుకుంటుంటారు. వారి మనసు బయట స్నేహితులతో ఎక్కువగా ఉంటుంది. తాము చెప్పిందే అందరూ వినాలన్నట్లు ప్రవర్తిస్తుంటారు. బయట ప్రపంచానికి మరింత ఆకర్షితులై తల్లిదండ్రులు మాట వినకుండా వారు మొండిగా తయారవుతారు. ఇలాంటి సమయంలో వీరిని ఎలా హ్యాండిల్ చేయాలో తెలియక చాలా మంది తల్లిదండ్రులు సతమవుతుంటారు. అయితే అలా మొండిగా తయారైన పిల్లలను ఎలా హ్యాండిల్ చేయడాలో కొన్ని టిప్స్ చూడండి..

ప్రోత్సాహం వద్దు

పిల్లలు సాధారణంగా ఏదో ఒకటి డిమాండ్ చేస్తూనే ఉంటారు. అది ఇప్పించని సమయంలో వారు మారాం చేస్తారు. వారు అడిగిన ప్రతి ఒక్కదానికి మీరు ఒప్పుకోవాలని అతను భావిస్తాడు. మీరు అలా చేయకపోతే ఏడుపు ప్రారంభిస్తారు. దీంతో నలుగురూ చూస్తున్నారయినా మీరు దానిని ఇప్పిస్తారు. కానీ అలా మీరు కరగకుండా ఉండాలి. కోపం కూడా తెచ్చుకోకూడదు. పట్టించుకోకుండా ఉండండి. వారు ఏడవగానే మీరు ఓదార్చడానికి వెళితే వారు మరింత మొండిగా తయారవుతారు. ఆ ట్రిక్ బాగా పనిచేస్తుందని అనుకుని ఇక ప్రతి విషయంలో ఇలానే ఏడవం ప్రారంభిస్తారు.

శిక్షించవద్దు


శిప్రతి తప్పుకు పిల్లలను శిక్షించవద్దు. బదులుగా, వారికి మాట్లాడే అవకాశం ఇవ్వండి. ఇది పిల్లల కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది. తద్వారా తనను తాను మరింత మెరుగ్గా వ్యక్తీకరించగలుగుతారు. ఉదాహరణకు, పిల్లవాడు దేనికైనా అనుమతి అడుగుతున్నట్లయితే, తన మాటలతో తల్లిని ఒప్పించమని చెప్పండి. అటువంటి పరిస్థితిలో, పిల్లలు తమను తాము మరిన్ని విధాలుగా వ్యక్తీకరించడం నేర్చుకుంటారు.

స్వేచ్ఛ కూడా అవసరం: ప్రతి విషయంలోనూ బిడ్డకు నో చెప్పడం కరెక్ట్ కాదు. ఇది వారి మనస్సులో తల్లిదండ్రుల పట్ల ప్రతికూల ఆలోచనలు పెంచుతాయి. అటువంటి పరిస్థితిలో కొంత స్వేచ్ఛ ఇవ్వడం కూడా అవసరం. స్నేహితులతో ఆడుకోవడం, మాట్లాడటం, తిరగడానికి అనుమతి ఇవ్వడం వంటివి. అయితే అదే సమయంలో పిల్లలపై ఓ కన్నేసి ఉంచడం కూడా చాలా ముఖ్యం. లేకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

అన్నింటికీ తిట్టొద్దు: పిల్లవాడు వచ్చి తన తప్పును అంగీకరిస్తే తిట్టడం, కొట్టడం వంటివి చేయొద్దు. అతన్ని తిట్టడానికి బదులు, ప్రశాంతంగా వినండి. ఆ సమయంలో వారికి ఓదార్పు మాత్రమే ఇవండి. తప్పు చేసినప్పుడు ఒప్పుకోవాలని వారికి వివరించండి. అలా చేయడం ద్వారా పల్లల సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెరగడంతో పాటు అబద్ధాలు చెప్పే అలవాటు కాకుండా ఉంటుంది.

వాదన వద్దు: పిల్లలు వాదిస్తున్నప్పుడు మీరు తిరిగి వాదించకండి. అలా చేస్తే వాదించడం మంచి పద్ధతేమో అని ప్రతి చోటా అదే పని చేస్తాడు. కాబట్టి పిల్లల మాటల్లో కొన్నింటికే స్పందించండి. ఇది పిల్లవాడు నేర్చుకోవడానికి, అర్థం చేసుకోవడానికి అవకాశం ఇస్తుంది.

ఏడుపుకు లొంగకండి : పిల్లవాడు ఏడుస్తూ, అరుస్తూ, ప్రతి విషయంలో మీతో వాదిస్తుంటే అతడిని ఎక్కువగా పట్టించుకోకండి. లేకుంటే అలాంటి డ్రామాలు ఎక్కువైపోతాయి. నిరంతరం పిల్లలను మెరుగుపరచడానికి ప్రయత్నించండి. ఈ వయసులోనే పిల్లల్ని సరైన దారిలో పెట్టాలి. అతనికి పద్ధతులను నేర్పించాలి.



వెండి గ్లాసులో నీళ్లు తాగితే జరిగేది ఇదే..!

ఆహారం మన ఆరోగ్యం అని వైద్యులు చెప్తారు. మనం ఆహారం ఎందులో తింటున్నాం.. ఎలా తింటున్నాం అన్న అంశాలు కూడా మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని ఆయుర్వేద నిపుణుల మాట. అందుకే గతంలో అరటి ఆకులో ఆహారం వడ్డించుకుంటే.. నీళ్లు తాగడానికి కూడా రాగి, వెండి గ్లాసులు వినియోగించేవారు. ఇవి మన ఆరోగ్యంపై ఎంతో ప్రభావం చూపుతాయని పెద్దలు అంటారు. అసలు ఇంతకీ ఆహారం తీసే సమయంలో గట్టిగా ఒక నిమిషం కూడా వాడని వెండి గ్లాసులు మన ఆరోగ్యాన్ని ఎలా ప్రభావం చేస్తాయి. వెండి పాత్రలు వినియోగిస్తే ఎంతో ఉపయోగకరమనే.. శిశువులకు వెండి పాత్రల్లోనే ఆహారం పెట్టడం, ఉగ్గు పోయడం చేసేవారు. కానీ నీళ్లను వెండి గ్లాసుల్లో తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. అవేంటంటే..



వ్యాధులపై పోరాడుతుంది

వెండి పాత్రలో తినడం వల్ల జీవక్రియ బాగా పెరుగుతుంది మరియు రోగనిరోధక శక్తి బలపడుతుంది. అంతేకాకుండా, వెండి పాత్రలలో తినడం వల్ల అనేక వ్యాధులు రాకుండా నివారిస్తుందని నిరూపించబడింది. వెండి దాని లోహ స్వభావం పరంగా చల్లగా ఉన్నప్పటికీ, వ్యాధులతో పోరాడటానికి సహాయపడే ఖనిజాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి. నిజానికి, వెండి గ్లాసులో నీరు త్రాగడం వల్ల పిల్లలను కాలానుగుణ సమస్యల నుండి రక్షించడంలో సహాయపడుతుందని గమనించబడింది.




న్యాచురల్ ఫిల్టర్..

వెండి పాత్రలలో ఖనిజాలు ఉండటం నీటిని శుద్ధి చేయడంలో సహాయపడుతుంది. ఏ రకమైన కల్తీ పదార్థాలతోనైనా పోరాడుతుంది. అందువల్ల, వెండి పాత్రలలో నీరు త్రాగడం ఎల్లప్పుడూ మంచిది.

మెదడు శక్తిని పెంచుతుంది

వెండి సారాల్ని అనేక ఆయుర్వేద ఔషధాలలో క్రియాశీల పదార్థంగా ఉపయోగిస్తున్నారు. ఇది ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడటమే కాకుండా, వయసు పెరుగుతున్న కొద్దీ మెదడు శక్తిని పెంచడంలో కూడా సహాయపడుతుంది. అందువల్ల, పిల్లలను ఆరోగ్యంగా ఉంచడానికి వెండి పాత్రల్లో తినిపించడం ఉత్తమ మార్గం.వెండి గ్లాసులో నీళ్లు తాగడం శరీరానికి అంత మంచిదా? ఆయుర్వేదం ప్రకారం, శరీరం అనేది మూడు దోషాల యొక్క ప్రత్యేకమైన కలయిక. కఫం, పిత్తం మరియు కఫం. వెండి గ్లాసుల్లో నీళ్లు తాగడం వల్ల అదనపు పిత్తం చల్లబడి సమతుల్యం అవుతుందని చెబుతారు. పేగు ఆరోగ్యానికి అంతరాయం కలిగించే హానికరమైన బ్యాక్టీరియాను చంపుతుంది. వెండి గ్లాసులో నీళ్లు తాగడం వల్ల రక్తాన్ని శుద్ధి చేయడం, విషపదార్థాలను బయటకు పంపడం మరియు మొత్తం జీవక్రియ మెరుగుపడుతుందని చెబుతారు. మెదడు కణాలను ఆక్సీకరణ ఒత్తిడి మరియు ఫ్రీ రాడికల్ నష్టం నుండి కాపాడుతుంది. ఇది పార్కిన్సన్స్ మరియు అల్జీమర్స్ వంటి న్యూరోడీజెనరేటివ్ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.



శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడానికి
వెండికి సహజంగా చల్లబరిచే లక్షణాలు ఉండటం వల్ల శరీరంలోని అదనపు వేడిని తగ్గించడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా వేడి వాతావరణంలో, వెండి కప్పు నుండి నీరు త్రాగడం వల్ల శరీర అంతర్గత ఉష్ణోగ్రతను నిర్వహించడానికి మరియు శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.

యాంటీ బాక్టీరియల్ లక్షణాలు
వెండికి యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయని చెబుతారు. ఈ లక్షణాలు నీటిలోని హానికరమైన బ్యాక్టీరియా మరియు వ్యాధికారకాలను నాశనం చేస్తాయి, దానిని సురక్షితంగా చేస్తాయి.

పీహెచ్ స్థాయిలు బ్యాలెన్స్ చేస్తాయి..
మీరు వెండి కప్పు నుండి నీరు త్రాగినప్పుడు, అది శరీరంలో ఆల్కలీన్ వాతావరణాన్ని నిర్వహించడానికి సహాయపడుతుంది. దీనివల్ల ఆమ్లత్వం తగ్గుతుందని చెబుతున్నారు.

నీటి ద్వారా సంక్రమించే వ్యాధులకు
వెండిలోని క్రిమినాశక లక్షణాలు కలరా మరియు టైఫాయిడ్ వంటి నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడతాయి.



PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S